పైసలిస్తేనే పని...!



మదనపల్లెలోని నీటి పారుదల శాఖ డివిజన్ కార్యాలయం

- నీటిపారుదల శాఖలో వసూల్ రాజాలు
- నీరు-చెట్టు బిల్లుకు కమీషన్ వసూళ్లు
- సొమ్ములిస్తేనే బిల్లు అప్‌లోడ్
- లేకుంటే కొర్రీలు.. బీరువాకే పరిమితం
- ఎప్పుడో చేసిన పనులకు ఇప్పుడు కమీషన్లా?

మదనపల్లె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నీటి పారుదల శాఖలో కమీషన్ల పర్వం కొనసాగుతోంది. ఎప్పుడో 2016-19లో చేసిన నీరు-చెట్టు పనులకు ఇప్పుడు పెడుతున్న బిల్లులకు డబ్బులు అడగటం ఏంటని బాధితులు వాపోతున్నారు. అసలే అప్పులు, ఆపై వడ్డీ కూడా గిట్టుబాటు కాగా నష్టాలపాలైన వారి నుంచి ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. పని విలువతో పనిలేకుండా ఎం-బుక్కుకు రూ.6 వేల నుంచి రూ.10 వేలు, బిల్లులు అయిన పనులకు డిపాజిట్ సొమ్ములు వెనక్కి ఇవ్వడానికి పెట్టే బిల్లుకు రూ.3 వేల నుంచి రూ.5 వేలు వసూలు చేస్తున్నారు. మదనపల్లె ఇరిగేషన్ డివిజన్ కార్యాలయంలో పెండింగ్ బిల్లుల చెల్లింపు ప్రక్రియలో భాగంగా రికార్డు అయిన ఎం-బుక్కులో పాస్‌ఆర్డర్ అయిన తర్వాత చిత్తూరు పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్ (పీఏవో) కార్యాలయానికి బిల్లులు అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఇక్కడ ఆ పని జరగాలంటే ఇక్కడున్న అధికారులు, సిబ్బందిని పైసలతో ప్రసన్నం చేసుకోవాల్సి వస్తోంది. గత టీడీపీ హయాంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికంగా ఉన్న రైతులు నీరు-చెట్టు పనులు చేపట్టారు. బిల్లులు పెట్టే క్రమంలో 2019లో ఎన్నికలు రావడంతో బిల్లుల చెల్లింపులకు బ్రేక్ పడింది. తర్వాత చాలా మంది కోర్టుకు వెళ్లి బిల్లులు పొందగా, మిగిలిన మరికొందరికి కూటమి ప్రభుత్వం బిల్లుల చెల్లింపు ప్రక్రియ మొదలు పెట్టింది. ఇందులో భాగంగా స్థానిక ఇరిగేషన్ డివిజన్ కార్యాలయంలో బిల్లుల అప్‌లోడ్ ప్రక్రియ మొదలైంది. దీనిని ఆసరాగా తీసుకున్న కార్యాలయ అధికారులు, సిబ్బంది వసూళ్లకు తెర లేపారు. పైసలిస్తేనే పని మొదలు పెడుతున్నారు. లేకుంటే వివిధ కొర్రీల పేరుతో ఎం-బుక్కులను బీరువాకు ఎక్కిస్తున్నారు. ఈ విషయాన్ని బాధితులైన పార్టీ శ్రేణులు.. స్థానిక కూటమి నేతలు, ఆ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, పైసలిస్తేనే బిల్లుల ప్రక్రియ ముందుకెళ్లడం లేదని వాపోతున్నారు.

మదనపల్లె ఇరిగేషన్ డివిజన్ కార్యాలయం పరిధిలో మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాలు ఉన్నాయి. వీటి పరిధిలో గత టీడీపీ ప్రభుత్వంలో నీరు-చెట్టు పథకంలో రెండు వేలకు పైగా పనులు చేపట్టారు. ఇందులో ఎక్కువభాగం తంబళ్లపల్లె నియోజకవర్గంలో చేసినవే ఉన్నాయి. ఇందులో సప్లయ్ చానల్ పూడికతీత పనులు, చెరువు కట్టను బలపరచడం, తూముల రిపేర్లు, చెక్‌డ్యాంల నిర్మాణం పనులు చేపట్టారు. ఇందులో పనిని బట్టి రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ ఉన్నాయి. ఈ పనులన్నీ 2016-17 నుంచి 2018-19 వరకూ చేపట్టారు. అయితే మొదట్లో 2016-17లో చేపట్టిన పనులకు అంచెలంచెలుగా బిల్లులు మంజూరు కాగా తర్వాత బ్రేక్ పడింది. 2019 ఎన్నికల నేపథ్యంలో పసుపు-కుంకుమ పథకానికి నిధుల మళ్లింపుతో 2017-18, 2018-2019 నీరు-చెట్టు పనుల బిల్లులు ఆగిపోయాయి. పెండింగ్ బిల్లుల్లో అప్పటికే చాలా పనులకు సంబంధించిన బిల్లులు చిత్తూరు పే అండ్ అకౌంట్స్ ఆఫీస్ (పీఏవో)కు వెళ్లినా ప్రయోజనం లేకపోయింది. తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నీరు-చెట్టు పనులకు బిల్లులు ఆపేసింది. ఈ నేపథ్యంలో చాలామంది కాంట్రాక్టర్లు, టీడీపీ కార్యకర్తలు కోర్టుకు వెళ్లడంతో ప్రభుత్వం బిల్లులు చెల్లించింది. ఇలా కోర్టుకు వెళ్లిన వారికే బిల్లులు రాగా, మిగిలిన వారివి ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇలా తంబళ్లపల్లె నియోజకవర్గంలో గరిష్ఠంగా 300 పనులకు సంబంధించిన బిల్లులు, మదనపల్లె, పీలేరు నుంచి కనిష్ఠంగా 50 చొప్పున వంద బిల్లులు ఉన్నట్లు చెబుతున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గతంలో చేపట్టిన నీరు-చెట్టు పనులకు బిల్లుల చెల్లింపు ప్రక్రియ మొదలు పెట్టింది. ఈ క్రమంలో బాధితులంతా బిల్లులు మంజూరుకు చేపట్టాల్సిన ప్రక్రియకు మొదలు పెట్టారు. ఇందులో భాగంగా ఇరిగేషన్ ఏఈఈ, జేఈలను ఆశ్రయించి వివరాలు తీసుకుని, వాటిని పీఏవో కార్యాలయానికి అప్‌లోడ్ చేయించుకునేందుకు ఇక్కడి కార్యాలయానికి క్యూ కడుతున్నారు. దీనిని ఆసరాగా తీసుకున్న ఇక్కడి అధికారులు, సిబ్బంది కాంట్రాక్టర్లు, పనులు చేసిన రైతులు, టీడీపీ కార్యకర్తల నుంచి సొమ్ములు వసూలు చేస్తున్నారు. ఇలా ఒక్కో పనికి రూ.6 వేలు నుంచి రూ.10 వేలు, డిపాజిట్ సొమ్ము తిరిగి పొందేందుకు చేపట్టే ప్రక్రియకు రూ.3 వేల నుంచి రూ.5 వేలు వసూలు చేస్తున్నారు. పైరవీలు, రాజకీయ నాయకుల మాటలతో పనిలేకుండా ప్రతి పనికీ ముక్కు పిండి వసూలు చేస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. ఒక్కో నియోజకవర్గంలో చేపట్టిన పనులకు సంబంధించి ఇరిగేషన్ డివిజన్ కార్యాలయంలో ఎం-బుక్కులకు పాస్ ఆర్డర్ వేసి, వాటిని మేనేజర్ ద్వారా ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు చెక్‌మెజర్ అయిన తర్వాత ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఇందులో ఎక్కువగా తంబళ్లపల్లె నియోజకవర్గానికి సంబంధించిన బిల్లులు ఉండటమే కాదు..వసూళ్లలోనూ ప్రథమ స్థానంలో ఉన్నారు.

మదనపల్లె డివిజన్‌లోని నీటిపారుదల శాఖలో కొందరు అధికారులు, సిబ్బంది పైసలిస్తేనే పని చేస్తున్నారని పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. 2016-19 కాలంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో చేసిన నీరు-చెట్టు పనులకు సంబంధించిన బిల్లులు చేయడంలో వారు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఆ బిల్లులు అప్‌లోడ్ చేయాలన్నా, ఎం-బుక్కులో రాయాలన్నా డబ్బులు ఇవ్వందే చేయడం లేదని, ఏళ్ల తరబడి బిల్లులు రాక అప్పుల ఊబిలో కూరుకుపోయిన తాము తిరిగి వారికి మామూళ్లు ఇవ్వలేకున్నామని బాధితులు వాపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కురబలకోట మండలంలో నీరు-చెట్టు పథకంలో చేపట్టిన చెరువు మరమ్మతు పనులు (ఫైల్)

డబ్బులు వసూలు చేస్తున్నట్లు నా దృష్టికి రాలేదు

నీరు-చెట్టు పనులకు సంబంధించి బిల్లులు అప్‌లోడ్ చేయడానికి సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నట్లు నా దృష్టికి రాలేదు. ఎవరికైనా అలాంటి ఇబ్బంది ఉంటే నాకు ఫిర్యాదు చేస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటా. పెండింగ్ బిల్లుల మంజూరుకు చర్యలు చేపడతా. డిపాజిట్ సొమ్ము పొందేందుకు గతంలో సీఎఫ్ఎంఎస్‌లో బిల్లు అప్‌లోడ్ చేసే వాళ్లం. దాని స్థానంలో ప్రభుత్వం కొత్తగా తెచ్చిన 'నిధి'యాప్‌తో వస్తున్న ఇబ్బందుల దృష్ట్యా అప్‌లోడ్ చేయడంలో ఇబ్బందులు ఉన్నాయి.

- సురేశ్‌బాబు, ఈఈ, నీటి పారుదల శాఖ, మదనపల్లె.



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

గూడు కోసం గోడాడిస్తున్నారు

- కలెక్టరేట్ వద్ద మహిళల నిరసన

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రామాపురం మండలం నల్లగుట్టపల్లెకు చెందిన దాదాపు 30 మంది మహిళలు ఇళ్ల కోసం సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలో ఇళ్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని, ఈ విషయమై అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎస్టీ కాలనీలో దాదాపు 50 కుటుంబాల వారు నివసిస్తున్నారని, దాదాపు 80 ఏళ్ల క్రితం ఇచ్చిన ఇళ్లల్లో బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నామని, పెచ్చులు ఊడిపోయి కిందపడే పరిస్థితిలో జీవనం గడుపుతున్నామని వారు వాపోయారు. ఈ విషయాలపైన సంబంధిత అధికారులు చొరవ చూపి మా కాలనీలో కొత్త ఇళ్లు మంజూరు చేయాలని వారు కోరారు.

అర్జీలపై నిర్ణయాత్మకమైన చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ నిశాంత్‌కుమార్



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీ సర్కిల్), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సంక్లిష్టమైన అర్జీలపై నిర్ణయాత్మకమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రభుత్వం 2020లో సర్వే నెంబర్ 401-3 ప్లాట్ నెంబర్ 18లో నాకు ఇంటి జాగాను కేటాయించిందని, కానీ ఇప్పటి వరకు రెవెన్యూ అధికారులు నా స్థలాన్ని చూపడం లేదని కేటాయించిన స్థలాన్ని ఇప్పించాలని రాయచోటి మండలం యండపల్లికి చెందిన వెంకటమ్మ కలెక్టర్‌కు విన్నవించుకుంది. జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు...?

- స్పిరిట్ సరఫరా చేసిన జితిన్, మరో ఇద్దరిని విచారిస్తున్న ఎక్సైజ్ పోలీసులు
- మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్‌లో రహస్య విచారణ



నకిలీ మద్యం బాటిళ్లు (ఫైల్)

ములకలచెరువు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు నకిలీ మద్యం కేసుకు సంబంధించి ఎక్సైజ్ పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వీరిని మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్‌లో ఎక్సైజ్ పోలీసులు రహస్యంగా విచారిస్తున్నట్లు సమాచారం. ములకలచెరువు, ఇబ్రహీంపట్నంలలో జరిగిన నకిలీ మద్యం తయారీకి సంబంధించి ప్రధాన నిందితుడు జనార్దన్‌రావుతో చేతులు కలిపి స్పిరిట్ రవాణా చేసిన బెంగళూరుకు చెందిన బాలాజీ, అతడి కుమారుడు సుదర్శన్‌ను ఎక్సైజ్ పోలీసులు గత నెల 26వ తేదీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బాలాజీ ఇచ్చిన వాంగ్మూలం మేరకు గోవాలో స్పిరిట్ సేకరించి సరఫరా చేసిన జితిన్‌ను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గోవాలో జితిన్ కోసం మకాం వేసిన ఎక్సైజ్ పోలీసులు అతడిని పట్టుకున్నారు. అతడితో పాటు గుజరాత్ నుంచి బాటిళ్ల మూతలు సరఫరా చేసిన మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. వీరిని మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్‌లో ఉంచి రహస్యంగా విచారించి కీలక విషయాలు రాబట్టినట్లు తెలిసింది. కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి విచారిస్తున్నట్లు సమాచారం.

ఫిర్యాదుల పరిష్కారంలో ఆలస్యం చేయొద్దు

- పీజీఆర్ఎస్‌లో ఎస్పీ ధీరజ్ కునుబిల్లి




దివ్యాంగుల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

రాయచోటిటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంలో ఆలస్యం చేయకుండా బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన రాయచోటి పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల అర్జీలను స్వయంగా స్వీకరించి వారితో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఇందులో ప్రధానంగా కుటుంబ కలహాలతో పాటు సైబర్ మోసాలు, భూవివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసాలు, ప్రేమల పేరుతో మోసాలు చేయడం తదితర సమస్యలపై ఎస్పీ స్వయంగా విచారణ జరిపారు. అలాగే పలు సమస్యలపై జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి వచ్చి నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగుల వద్దకు ఎస్పీ స్వయంగా వెళ్లి వారి ఫిర్యాదులను స్వీకరించి సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఫిర్యాదులపై సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించాలని జిల్లాలోని పోలీసు అధికారులను ఆదేశించారు. అంతేగాక బాధితులు ఇచ్చిన ఫిర్యాదులపై చట్టపరమైన చర్యలు తీసుకున్న వెంటనే సంబంధిత వివరాలతో కూడిన నివేదికలను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని స్పష్టం చేశారు.

హర హర మహాదేవ... శంభో శంకర

- మహాశివరాత్రిని తలపించిన రెండో కార్తీక సోమవారం
- భక్తులతో కిటకిటలాడిన మల్లయ్యకొండ



ఆలయం ముందు కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



ప్రత్యేక అలంకరణలో మల్లికార్జునస్వామి

తంబళ్లపల్లె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : హర హర మహాదేవ.. శంభో శంకర నామస్మరణతో తంబళ్లపల్లె మల్లయ్యకొండ పులకించింది. కార్తీక రెండో సోమవారం సందర్భంగా పురాతన శైవ క్షేత్రం మల్లయ్యకొండకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. మల్లయ్యకొండకు తరలివచ్చిన భక్తులతో మహాశివరాత్రిని తలపించింది. భక్తులు శివన్నామస్మరణతో భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఈశ్వరప్ప స్వామి స్వామి వారిని వెండి నాగాభరణంతో అలంకరించి దూపదీప నైవేద్యాలతో స్వామి వారికి పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయం ముందు ధ్వజస్తంభం వద్ద మహిళలు కార్తీక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. కొండ పైన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్తీక మాసంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తంబళ్లపల్లె నుంచి మల్లయ్యకొండ పైకి ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడిపారు. మల్లయ్యకొండ పైన కేదారేశ్వర గౌరీ నోములు నోచుకునేందుకు వచ్చిన భక్తులు ఆలయ అధికారులు సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో ఇబ్బందులు పడ్డారు.

కార్తీక మాసంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మల్లయ్యకొండ పైన నోములు నోచుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వందల సంఖ్యలో వస్తారు. గతంలో ఆలయానికి సమీపంలో ఉన్న కల్యాణ కట్ట వద్ద గౌరమ్మను ప్రతిష్ఠించి అక్కడ నోములు నోచుకునే సౌకర్యం ఉండేది. అయితే ఈ ఏడాది ఆలయం వెనుక వైపు ఉన్న ఓ చిన్న గదిలో ఏర్పాట్లు చేశారు. ఎక్కువ మంది భక్తులు రావడంతో నోములు నోచుకోవడానికి గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. ఇకనైనా ఆలయ అధికారులు ఈ విషయాన్ని గమనించి భక్తులకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

నేడు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జనార్దన్‌రెడ్డి రాక

రాయచోటి (నేతాజీ సర్కిల్), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మంగళవారం జిల్లాకు రానున్నట్లు అధికారులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా అభివృద్ధిపై సమీక్ష సమావేశం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2.30 వరకు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రితో పాటు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ నిశాంత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌లు పాల్గొంటున్నట్లు తెలిపారు.

తాళం పగులగొట్టి ఇంట్లో చోరీ

గుర్రంకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి బంగారం , వెండి ఆభరణాలు అపహరించుకు వెళ్లిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని కొత్తపేటలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న వసీమ్ అక్రమ్ గత నెల 28న ఇంటికి తాళం వేసి బెంగుళూరుకు వెళ్లాడు. సోమవారం మధ్యాహ్నం తిరిగి వచ్చిన అతను తాళం పగులగొట్టి ఉండడం గమనించాడు. దీంతో లోపలికి వెళ్లి చూడగా బీరువా పగిలిపోయి.. అందులోని దుస్తులు చిందర వందరగా పడి ఉండడం కనిపించింది . బీరువాలోని అరలను ఇనుప రాడ్డుతో ధ్వంసం చేసి అందులోని 10 గ్రాముల బంగారం, 100 గ్రాముల వెండి ఆభరణాలను తీసుకెళ్లినట్లు గుర్తించాడు. చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్లూస్ టీమ్‌ను పిలిపించి వేలి ముద్రలను సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ గజేంద్ర తెలిపారు.

బాలిక అదృశ్యం

రామసముద్రం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎలవానెల్లూరు పంచాయతీ ఎ.కొత్తూరు గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్లు కేసు నమోదు చేశామని ఎస్ఐ రమేశ్‌బాబు తెలిపారు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నవంబరు 2వ తేదీ నుంచి ఇంటి నుంచి వెళ్లిన బాలిక తిరిగి రాలేదని పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు. ఫిర్యాదు ఆధారంగా మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేరు కాపురం పెట్టలేదని మహిళ ఆత్మహత్య

రాయచోటి-నేతాజీ సర్కిల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేరుకాపురానికి భర్త అంగీకరించలేదని మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు దేవపట్ల గ్రామం అంబేద్కర్‌నగర్ కాలనీకి చెందిన దేవరింటి కన్నయ్య నాలుగో కూతురు మౌనిక (25)కు రెండేళ్ల క్రితం కడప జిల్లా అట్లూరు మండలం ఎస్. వెంకటాపురానికి చెందిన సునీల్‌తో వివాహమైంది. వీరికి ఆరు నెలల కుమారుడు ఉన్నాడు. వేరు కాపురం విషయమై భర్తతో గొడవపడిన మౌనిక రెండు నెలల క్రితం పుట్టింటికి చేరుకుంది. ఆదివారం ఆమె వాంతులు చేసుకోవడంతో గుర్తించిన తల్లిదండ్రులు విషం తాగినట్లు గుర్తించి రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, ప్రాథమిక చికిత్స అనంతరం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిందని, ఈ మేరకు మృతురాలి తండ్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

స్థలం వివాదంలో.. ఇరువర్గాలకు కౌన్సెలింగ్

రైల్వేకోడూరురూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థలం విషయంలో రెండు వర్గాలు ఘర్షణ పడడంతో పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. కోడూరు పట్టణంలోని సర్వే నెంబర్లు 5,7,13 ను కొందరు వ్యక్తులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అదే సర్వే నంబర్లు సుమారు 100 మందికి పైగా రిజిస్ట్రేషన్ అయ్యాయి. అయితే, దళిత వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు ఆర్ఎస్ఆర్‌లో తమ పూర్వీకుల పేర్లు ఉన్నాయని ఆ భూమి తమకే చెందుతుందంటూ ఇతరులను ఈ స్థలం వద్దకు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ విషయంపై రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు పలుసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం కనిపించలేదు. దీంతో సోమవారం స్థలం వద్దకు వెళ్లిన వారిపై దళిత వర్గానికి చెందినవారు దాడి చేయడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ కే.అమర్నాథ్, సీఐ కే.హేమసుందర్ రావు ఇరువర్గాల వారిని కోడూరు తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. రికార్డులను పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఇరువర్గాల వారిని బైండోవర్ చేశారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

17 నుంచి కుష్ఠువ్యాధిపై సర్వే



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి(నేతాజీ సర్కిల్), నవంబరు3(ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధి పై ప్రజల్లో అపోహలను తొలగించడంతోపాటు, బాధితులకు చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంపై రూపొందించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి 30 వరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కుష్ఠువ్యాధి బాధితులను గుర్తించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంగవైకల్య నివారణకు ఈ సర్వే ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రాథమిక దశలనే బాధితులను గుర్తించి వైద్య సేవలు అందిస్తే వ్యాధి పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రతి ఒక్కరికీ కుష్ఠువ్యాధి పరీక్షలు చేయాలని ఆదేశించారు. పాఠశాలలు, సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాల విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయాలని ఆదేశించారు. సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఎంహెచ్‌వో లక్ష్మీనరసయ్య, జిల్లా టీబీ అధికారి రాధిక, మెడికల్ ఆఫీసర్ విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచాలి: జేసీ

రాయచోటి(నేతాజీసర్కిల్), నవంబరు3(ఆంధ్రజ్యోతి): రైతులకు సుస్థిర వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచాలని, వ్యవసాయంలో పీ4 అమలు చేసి ఆదర్శ రైతులను మార్గదర్శకులుగా చూపించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులకు సూచించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో భూమాత రక్షణ కార్యక్రమంపై జిల్లా స్థాయి కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యసాయాఖ అధికారి కార్యక్రమంలోని వివిధ అంశాలను వివరించారు. భూసారం పెంపు, ఎరువుల వాడకాన్ని తగ్గించడం, రైతుల్లో సుస్థిర వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంపొందించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఎరువుల వినియోగాన్ని తగ్గించడంపై రైతులకు అవగాహన కల్పించేందుకు కృషి విజ్ఞాన కేంద్రం అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ, భూమాత రక్షణ కార్యక్రమం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మీరైనా పట్టించుకోండి మేడం

● పరిహారం చెల్లింపులో జాప్యంపై భూ నిర్వాసితుల వినతి



వృద్ధురాలి సమస్య తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్ కళ్యాణి

మదనపల్లె టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అవసరాలకోసం సేకరించిన భూమికి సంబంధించి నష్టపరిహారం చెల్లింపులో జాప్యం చేస్తున్నారు.. మీరైనా పట్టించుకుని న్యాయం చేయండి మేడం అంటూ పలువురు రైతులు సబ్‌కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో సబ్‌కలెక్టర్ చల్లా కల్యాణి ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. పీటీఎం మండలంలో హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ కోసం సేకరించిన భూములకు నష్టపరిహారం చెల్లింపులో జాప్యం చేస్తున్నారని కందుకూరుకు చెందిన సాబ్‌జాన్ సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మదనపల్లె మండలం కోటవారిపల్లె పంచాయతీలో డంపింగ్ యార్డు నిర్మాణానికి తాను రూ.65,275 ఖర్చు చేయగా అధికారులు రూ.37,768 మాత్రమే చెల్లించారని, మిగిలిన సొమ్ము కోసం ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నానని.. సమస్య పరిష్కరించాలని సురేంద్ర అనే వ్యక్తి విన్నవించారు. మదనపల్లె పట్టణ శివారులో కొందరు నకిలీ ఇంటి పట్టాలతో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుంటున్నారని బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మొంథా తుఫాను కారణంగా ములకలచెరువు మండలం సోంపల్లె వద్ద అడవిచెరువుకు గంగి పడి రోడ్డు కోసుకుపోయిందని, దేవలచెరువు రోడ్డు గుంతలమయమైందని, మరమ్మతులు చేయించాలని ఏఐకేఎంఎస్ అధ్యక్షుడు వైవీ రమణ సబ్‌కలెక్టర్‌ను కోరారు. వీటితో పాటు భూ సమస్యలు, సర్వే సమస్యలు, అంత్యోదయ కార్డుల కోసం ప్రజలు అర్జీలు సమర్పించారు. కాగా, సరోజిని అనే వృద్ధురాలు పీజీఆర్ఎస్ హాలుకు వచ్చి నడవలేక కూర్చుండిపోవడాన్ని గమనించిన సబ్‌కలెక్టర్ ఆమె వద్దకు వెళ్లి అర్జీని పరిశీలించి, మెడికల్ రీయింబర్స్‌మెంట్ మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

హైవే పనులకు రూ.85 కోట్ల నిధులు



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని సన్మానిస్తున్న ముక్కా..

రైల్వేకోడూరురూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కడప - రేణిగుంట నేషనల్ హైవే నిర్మాణ పనులకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి తెలిపారు. సోమవారం ఢిల్లీలోని కేంద్ర రహదారుల మంత్రి నితిన్ గడ్కరీని బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయి లోకేష్‌తో వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భారీ వర్షాల కారణంగా కడప-రేణిగుంట జాతీయ రహదారి తీవ్రంగా దెబ్బతిన్నదని, దీనివల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రోడ్డు పనుల నిమిత్తం నిధులు మంజూరు చేయాలని కోరగా తక్షణమే రూ.85 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు తెలిపారు.

భద్రకాళి, వీరభద్రులకు వెండి కిరీటాలు అందజేత



వెండి వస్తువులను అందజేస్తున్న వీరయ్య కుటుంబ సభ్యులు

రాయచోటిటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయానికి సోమవారం పలువురు దాతలు వెండి కిరీటాలు, వెండి వస్తువులు అందజేసినట్లు ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి తెలియజేశారు. కడప జిల్లా వేంపల్లికి చెందిన వడ్లకుంట వీరయ్య కుమారుడు రాచయ్య జ్ఞాపకార్థం రాజనరసింహారావు వీరభద్రస్వామికి 2.222 కేజీల వెండి నాగపడగతో కూడిన కిరీటం, వీవీఎల్ఎన్ రోహిత్ భద్రకాళి అమ్మవారికి 981 గ్రాముల వెండి జ్వాలా కిరీటం అందజేశారు. వంకదారి చంద్రశేఖరయ్య జ్ఞాపకార్థం వడ్లకుంట సుభాషిణి వీరభద్రస్వామి ఉత్సవ మూర్తికి 624 గ్రాముల వెండి కిరీటం, ఖడ్గం, 1, ఎడమ చేయి, పాదాలు, డాలు అందజేశారు. వడ్లకుంట విజయలక్ష్మి దేవమ్మ జ్ఞాపకార్థం వడ్లకుంట వైష్ణవి భద్రకాళీ అమ్మవారి ఉత్సవమూర్తికి 413 గ్రాముల వెండి కిరీటం, త్రిశూలం, ఎడమ హస్తం, పాదాలు అందజేశారు. మొత్తం మీద వడ్లకుంట వీరయ్య కుటుంబ సభ్యులంతా కలసి 4.240 కేజీల వెండి వస్తువులను సమర్పించారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు గాలివీడు విద్యార్థి



అయూబ్

గాలివీడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సెపక్ తక్రా పోటీలకు గాలివీడు జడ్పీహైస్కూల్ విద్యార్థి మహమ్మద్ అయూబ్ ఎంపికైనట్లు పీడీ గంగరాజు, ప్రధానోపాధ్యాయుడు కే. జాఫర్‌హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతపురం జిల్లా ఉరవకొండలో నవంబర్ 2, 3 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా క్రీడా పోటీల్లో మహమ్మద్‌అయూబ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యాడన్నారు. అనంతరం అయూబ్ ఎంపికపై హర్షం వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయ బృందం విద్యార్థిని అభినందించింది.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు మోటకట్ల విద్యార్థులు



రాయచోటి - నేతాజీ సర్కిల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ క్రీడా పోటీలకు మోటకట్ల హైస్కూల్ విద్యార్థులు 9 మంది ఎంపికయ్యారని హెచ్‌ఎం చప్పిడి పద్మజ తెలిపారు. సోమవారం పాఠశాలలో ఆయా విద్యార్థుల అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాఫ్ట్‌బాల్ అండర్-14 విభాగం బాలికల్లో నాగదీపిక, అండర్-17 బాలుర విభాగంలో వెంకట్, మనోజ్, బాలికల విభాగంలో హర్షిత ఎంపికయ్యారన్నారు. బేస్‌బాల్‌లో అండర్-14 బాలికల విభాగంలో మోక్షజ్ఞ, నాగదీపిక, అండర్-17 బాలుర విభాగంలో వెంకట్, బాలికల విభాగంలో హర్షిత ఎంపికయ్యారన్నారు. త్వరలో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను, వారికి శిక్షణ ఇచ్చిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు వేణుమాధవ్‌రాజును పాఠశాల సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చిదంబర్‌రెడ్డి, పద్మావతి, నాగేశ్వారెడ్డి, నాగేశ్వర్‌నాయక్, భాస్కర్, ప్రసాద్‌రాజు, నరసింహులు, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★


కథే ఈ సినిమాకు హీరో



దేవన్


దేవన్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన సినిమా 'కృష్ణ లీల'. 'తిరిగొచ్చిన కాలం' అనేది ఉపశీర్షిక. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్. జ్యోత్స్న జి నిర్మిస్తున్నారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దేవన్ మీడియాతో ముచ్చటించారు. 'ఇదో సూపర్ నేచురల్ లవ్‌స్టోరీ. కొత్తదనంతో నిండిన ఈ కథను నిర్మాతలకు వినిపించగానే ఓకే చేశారు. కృష్ణుడు ఒక ప్రేమ కథలో తన లీలలు ఎలా చూపిస్తారనేది ఆసక్తికరంగా చూపిస్తున్నాం. మనుషులు ఎలాగూ గడిచిపోయిన కాలాన్ని తిరిగి తీసుకురాలేరు. దైవత్వంతో ఆ కాలాన్ని తిరిగి తీసుకురావడమే చిత్ర కథాంశం. కృష్ణతత్వాన్ని అందరికీ మరింత బాగా అర్థమయ్యేలా ఇందులోని సన్నివేశాలు ఉంటాయి. కథే ఈ సినిమాకు హీరో. ప్రేమలోని గొప్పదనాన్ని అందంగా ఆవిష్కరిస్తుందీ చిత్రం. భీమ్స్ సిసిరోలియో సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. చిత్రం అన్ని వర్గాల వారినీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

నటుడిగా యాభై ఏళ్లు.. 22న భారీ వేడుక!




విలక్షణ నటుడు డాక్టర్ మోహన్‌బాబు నటుడిగా పరిచయమై ఈ ఏడాదికి యాభై ఏళ్లు. ఆయన హీరోగా నటించిన తొలి చిత్రం 'స్వర్గం నరకం' 1975 నవంబరు 22న విడుదల అయింది. ఈ అసాధారణ ప్రయాణాన్ని గౌరవించుకునే క్రమంలో ఈ నెల 22న 'ఎంబీ 50.. ఏ పెర్ల్ నైట్ ట్రిబ్యూట్' అనే పేరుతో ఓ భారీ వేడుకను మంచు విష్ణు నిర్వహించనున్నారు. 'దిగ్గజ నటుడిని, భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకొనేలా ఈ ఈవెంట్ ఉంటుందని మంచు విష్ణు చెప్పారు. ఎలాంటి సినిమా నేపథ్యం లేకపోయినా ఒంటరిగా సినీ ప్రయాణం మొదలు పెట్టి, తనకంటూ ఓ సామ్రాజ్యాన్ని ఏర్పరచుకుని విలక్షణ నటుడిగా ఎదిగిన మోహన్‌బాబు ఎదిగిన జర్నీ గురించి అందరికీ మరోసారి వివరించి చెప్పనున్నారు. ఈ వేడుక పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని మంచు విష్ణు చెప్పారు.

ఉత్తమ నటుడిగా మమ్ముట్టి రికార్డ్!



సోమవారం ప్రకటించిన కేరళ ఫిల్మ్ అవార్డ్స్‌లో మలయాళ చిత్రరంగ సూపర్‌స్టార్ మమ్ముట్టి ఏడోసారి ఉత్తమ నటుడిగా ఎన్నికై అరుదైన రికార్డ్ నెలకొల్పారు. నటుడు ప్రకాశ్‌రాజ్ అధ్యక్షతన ఏర్పాటైన ఏడుగురు సభ్యులున్న జ్యూరీ కమిటీ అవార్డులను ఎంపిక చేసింది. త్రిస్సూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేరళ మంత్రి షాజీ చెరియన్ అవార్డుల వివరాలు వెల్లడించారు. 'భ్రమరయుగం' చిత్రంలో నటించిన మమ్ముట్టి ఉత్తమ నటుడిగా ఎన్నికయ్యారు. ఉత్తమ చిత్రంగా 'మంజుమ్మల్ బాయిస్' ఎన్నికైంది. ఉత్తమ దర్శకుడు అవార్డ్ సహా మొత్తం ఎనిమిది అవార్డులతో ఈ సినిమా సత్తా చాటింది. ఉత్తమ నటుడిగా తను మరోసారి ఎన్నిక కావడంపై మమ్ముట్టి వ్యాఖ్యానిస్తూ 'ఇదో ప్రయాణం.. రకరకాల వ్యక్తులతో కలిసి చేసే సుదీర్ఘ ప్రయాణం. ఇక్కడ పోటీ అనే పదానికి తావు లేదు' అని అన్నారు.

రాకెట్‌కు బాహుబలి పేరు - రాజమౌళి హర్షం



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఇటీవలె ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ రాకెట్‌కు దాని బరువు, సామర్థ్యానికి తగ్గట్టుగా 'బాహుబలి' అనే పేరు పెట్టడంపై దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి హర్షం వ్యక్తం చేశారు. 'దేశానికి గర్వకారణమైన క్షణం ఇది. మా సినిమా టైటిల్‌తో ఉన్న రాకెట్ ఇంత గొప్ప విజయాన్ని సాధించడం మాకు చాలా ఆనందాన్నిచ్చింది' అని ఇస్రో శాస్త్రవేత్తలను రాజమౌళి అభినందించారు.

సినిమా టిక్కెట్‌ల వివాదంపై సుప్రీం స్టే

మల్టిప్లెక్స్‌లలోని సినిమా టిక్కెట్‌లకు ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలని కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఏకరూప టిక్కెట్ విధానాన్ని (రూ.200 + జీఎస్టీ) ప్రశ్నిస్తూ హొంబలె ఫిల్మ్, మల్టిప్లెక్స్‌ల సంఘం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు సింగిల్ జడ్జి మధ్యంతర స్టే ఇచ్చారు. ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. సెప్టెంబరు 30న 'ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలి' అని ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం టిక్కెట్ ధరలపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. మల్టిప్లెక్స్‌లలో వాటర్ బాటిల్‌కు రూ.100 వసూలు చేస్తున్నారని, ఇప్పటికే థియేటర్లకు వచ్చే వారి సంఖ్య తగ్గుతోందనీ, మరింత సహేతుకంగా ధరలను నిర్ణయించాలని, లేకపోతే హాళ్లు ఖాళీగా మారిపోతాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

మన జీవితాలకు వర్తించేలా ఉంటుంది



దీక్షిత్ శెట్టి

'దసరా', 'దియా' చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న దీక్షిత్ శెట్టి నటించిన తాజా చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. రష్మిక కథానాయికగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించారు. గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్లపై ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈ నెల 7న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు దీక్షిత్ శెట్టి. 'దసరా' సినిమాలో నేను పోషించిన పాత్ర నచ్చి, 'ది గర్ల్‌ఫ్రెండ్'లో నటిస్తారా అని దర్శకుడు రాహుల్ రవీంద్రన్ అడిగారు. ఆయన చెప్పిన స్క్రిప్ట్ నచ్చి వెంటనే అంగీకరించాను. ఇందులో నా పాత్ర పేరు విక్రమ్. నా పాత్ర తీరుతెన్నులు ఎలా ఉంటాయి అనేది చాలా క్లియర్‌గా వివరించేవారు రాహుల్. నా పాత్రకు కొన్ని నెగెటివ్ షేడ్స్ ఉంటాయి. ఇప్పటిదాకా మనం చూసిన ప్రేమకథలన్నీ ఒక తరహాలోనే సాగుతుంటాయి. ప్రేమకథని మరో కోణంలో ఆవిష్కరించే చిత్రమిది. మనందరి జీవితాలకు వర్తించేలా సినిమా ఉంటుంది' అని తెలిపారు.

PARAS

చకచకా... 'సోలార్' పనులు

- దువ్వూరు వద్ద పవర్‌ప్లాంట్ నిర్మాణం
- 5 మెగావాట్ల విద్యుత్తు ఉత్పాదన లక్ష్యం
- పూర్తయితే రైతులకు ప్రయోజనం



దువ్వూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంట పొలలకు అందించే కరెంటు సరఫరాలో తరచూ అవాంతరాలు ఎదురవుతున్నాయి. దీంతో పొలం పూర్తిగా తడవకముందే ఎదురవుతున్న ఆటంకాలతో అన్నదాతలు ఒకింత ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం చొరవతో జిల్లాలో మైదుకూరు, పులివెందుల, కడప, పోరుమామిళ్ల క్లస్టర్లలో సోలార్ పవర్‌ప్లాంట్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా దువ్వూరులో అయిదు మెగావాట్ల విద్యుత్తు ఉత్పాదన లక్ష్యంగా మెగా కంపెనీ పనులు చేపట్టింది.

దువ్వూరు సమీపంలోని గుట్టప్రాంతమైన సర్వే నంబరు 145లో 25 ఎకరాల ప్రభుత్వ స్థలంలో సోలార్ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. నాలుగు నెలల వ్యవధిలో ఈ పనులను పూర్తి చేసే విధంగా గడువు నిర్ణయించారు. ఇటీవల నెలకొన్న తుఫాను ప్రభావం పనులకు కొంత ఆటంకం ఏర్పడింది. ప్రస్తుతం ఈ పనులు ఊపందుకున్నాయి. రాయితీతో కూడిన గుట్ట ప్రాంతం కావడంతో మిషనరీని ఉపయోగించి సోలార్ ప్యానెల్స్ అమర్చేందుకు వీలుగా రంధ్రాలు వేస్తున్నారు. అయిదు అడుగుల లోతు, ఒక అడుగు వెడల్పుతో రంధ్రాలు ఏర్పరచి అలైన్‌మెంట్, కాలంపోస్టు పనులు చేస్తున్నారు. గత నెల 17వ తేదీన ఈ పనుల తీరుతెన్నులు పరిశీలించేందుకు తిరుపతి నుండి ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ లోతేటి శివశంకర్ ఇక్కడికి వచ్చారు. పనులు చేస్తున్న కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ మేరకు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ పవర్‌ప్లాంట్ నిర్మాణం పూర్తయితే రైతులకు ఎంతో ప్రయోజన కరంగా ఉంటుంది.

ముగిసిన జయంత్యుత్సవాలు



ఊరేగుతున్న గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రస్వామి

బ్రహ్మంగారిమఠం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 417 జయంతి మహోత్సవాలు సోమవారం ప్రత్యేక పూజలతో ముగిసాయి. ఉదయం సుప్రభాత పారాయణం, మండల పూజ, మధ్యాహ్నం నైవేద్య మహామంత్ర పుష్పం, ప్రసాద వినియోగం, సాయంత్రం 7గంటలకు భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రాంగణంలో కార్తీక సహస్ర దీపార్చన, మహామంగళ హారతి నిర్వహించారు. తెల్లవారు జామున గ్రామవీధుల గుండా జగద్గురు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సమేత గోవిందమాంబ గ్రామోత్సవం నిర్వహించారు. శాశ్వత ఉభయదాతలు ఇడమకంటి జనార్దన శివాచార్య కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఉభయదారులు బాలబ్రహ్మాచారి కుటుంబ సభ్యులు భక్తులకు ప్రసాదం అందించారు.

డిసెంబరు నాటికి కిచెన్ షెడ్లు పూర్తి చేయాలి : కలెక్టర్



వీసీ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

కడప కలెక్టరేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా అమలైన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్ల నిర్మాణాలు డిసెంబరు నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో యూనిక్‌గా ఏర్పాటు కానున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్స్ భవన నిర్మాణాల పురోగతిపై అన్ని డివిజన్ల ఆర్డీవోలు, సంబంధిత అధికారులతో వీసీ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ కడప నగరంలో, సీకేదిన్నెలో స్మార్ట్ కిచెన్‌ల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న బోజన పథకాన్ని మరింత శుచిగా, రుచి కరంగా తాజాగా విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. ఈ స్మార్ట్ కిచెన్లు రాష్ట్రానికి ఆదర్శంగా ఉన్నాయన్నారు. ఇదే స్ఫూర్తితోనే జిల్లాలో నూతనంగా 33 స్మార్ట్ కిచెన్ షెడ్లను ఏర్పాటు చేస్తున్నామని, అందులో 23 స్మార్ట్ కిచెన్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయన్నారు. మిగిలిన వాటిని కూడా రెండు రోజుల్లో ప్రారంభించాలన్నారు. ఇందులో స్థల కేటాయింపు, ఇసుక కంకరకు సంబంధించి సమస్యలు ఉన్నట్లయితే రెవెన్యూ అధికారులు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్మార్ట్ కిచెన్లలో ఏర్పాటు చేసే పరికరాల కోసం టెండర్, కొనుగోలు మొదలైన అంశాలపై సమీక్షించారు. స్మార్ట్ కిచెన్ల ద్వారా అందించే మధ్యాహ్న భోజనాన్ని పాఠశాలల్లో వంద శాతం మంది విద్యార్థులు తింటున్నారా.. లేదా.. అందులో నాణ్యత విషయమై తల్లిదండ్రుల నుంచి అభిప్రాయాలను కూడా సేకరించాలన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా స్మార్ట్ పార్మింగ్ ఏర్పాటుకు మండలాల్లో సదుపాయాలను సమకూర్చాలన్నారు. కూరగాయల తోటల పెంపకం, కొనుగోలు సంబంధిత అంశాలపై ఏపీ ఈఎన్ఎఫ్, డీఆర్‌డీఏ అధికారులు సమన్వయంతో ప్రణాళికలు రూపొందించాలన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు హజరత్తయ్య, ఓబులమ్మ, షంషద్దీన్, రాజ్యలక్ష్మి, ఆదిశేషారెడ్డి, స్మార్ట్ కిచెన్ల పర్యవేక్షకులు జోయల్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో 20 మందిపై కేసు నమోదు

వేంపల్లె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం హనుమాన్‌జంక్షన్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన దాడిఘటనలో పరస్పర ఫిర్యాదుల మేరకు టీడీపీ, వైసీపీలకు చెందిన 20 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నరసిం హులు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు అలిరెడ్డిపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న వైసీపీకి చెందిన రాఘవరెడ్డి, టీడీపీకి చెందిన గోపీనాథ్‌రెడ్డిలు సోషల్‌మీడియాలో పరస్పరం రెచ్చగొట్టే వ్యాఖ్యలు పెట్టేవారు. పరస్పరం ఫోన్‌లో సవాళ్లు విసురుకున్నారు. ఈక్రమంలో హనుమాన్ జంక్ష న్ వద్ద ఉన్న రాఘవరెడ్డి వద్దకు వచ్చి గోపీ నాథ్‌రెడ్డి దాడికి దిగారు. గాయపడ్డ రాఘవరెడ్డి కడపలో చికిత్స పొందుతున్నారు. రాఘవరెడ్డి ఫిర్యాదు మేరకు గోపీనాథ్‌రెడ్డితో పాటు మరో ఐదుగురిపై, అలాగే గోపీనాథ్‌రెడ్డి ఫిర్యాదు మేర కు రాఘవరెడ్డితో పాటు 15 మందిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

తమ్ముని చంపిన అన్న అరెస్టు



మాట్లాడుతున్న సీఐ రోషన్

కమలాపురం రూరల్, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని అపావరావుపల్లె గ్రామంలో ఆస్తి తగాదా విషయమై సొంత తమ్ముడినే హత్య చేసిన కేసులో అన్నను అరెస్టు చేసి రిమాండుకు తరలించామని సీఐ రోషన్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు తెలి పారు. అప్పారావుపల్లె గ్రామంలో అక్టోబరు 30వ తేదీ సొంత తమ్ముడైన విశ్వనాథరెడ్డితో ఆస్తి సంబంధ విషయాలపై అన్న చెన్నారెడ్డి వాగ్వా దానికి దిగాడు. ఇరువురి మధ్య మాటా మాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. దీంతో తమ్ముడు విశ్వనాథరెడ్డిపై చెన్నారెడ్డి దాడి చేయడంతో తీవ్రగాయాలై అక్కడకక్కడే కుప్ప కూలిపోయాడు. అస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. అప్పటి నుంచి పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ విద్యాసాగర్, సిబ్బందితో ప్రత్యేక టీంలుగా ఏర్పడి సోమవారం మధ్యాహ్నం చెన్నారెడ్డిని గోపులాపురం క్రాస్ రోడ్డు వద్ద అరెస్టు చేశామని సీఐ తెలిపారు. ఆస్తి సంబంధ విషయాలు, ఇతర సమస్యలను అధికారులు లేదా కోర్టులను ఆశ్రయించి పరిష్కరించుకోవాలన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇంజనీరింగ్ విద్యార్థిపై దాడి



గాయపడిన శాంతన్‌రెడ్డి

రాజంపేటటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల పరిధిలో చదువుతున్న ఇంజనీరింగ్ విద్యార్థి ఊరగాయల శాంతన్‌రెడ్డిపై కొందరు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. పోలీసుల వివరాల మేరకు.. రాయచోటి రామాపురానికి చెందిన శాంతన్‌రెడ్డి అన్నమాచార్య యూనివర్శిటీలో ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఏడాది క్రితం శాంతన్‌రెడ్డి, నితిన్ బోయనపల్లిలో ప్రైవేటుగా ఉన్న సమయంలో కొందరు వ్యక్తులు నితిన్‌పై దాడి చేశారు. ఆ దాడిలో శాంతన్‌రెడ్డి పాత్ర ఉందని కక్ష కట్టిన కొందరు వ్యక్తులు సోమవారం తెల్లవారుజామున రూములోకి వచ్చి అతనిపై దాడి చేసి గాయపరిచారు. గాయపడిన విద్యార్థిని స్థానిక విద్యార్థులు గమనించి రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించారు. ఈ దాడిపై మన్నూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటో బోల్తా... నలుగురికి గాయాలు

మదనపల్లె అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆటో బోత్తాపడి నలుగురు వ్యక్తులు గాయపడిన సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గుర్రంకొండ మండలం టి.రాచపల్లెకు చెందిన సిద్దారెడ్డి (92) అనారోగ్యంతో ఉండడంతో మదనపల్లె ఆస్పత్రికి తరలించడానికి ఆటోలో బయలు దేరారు. ఆరోగ్యవరం వద్దకు చేరకుకోగానే కుక్కలు ఆటోకు అడ్డురావడంతో వాటిని ఢీ కొట్టి ఆటో బోల్తాపడింది. ఈప్రమాదంలో ఆటోలో ఉన్న సిద్దారెడ్డి కుమారై అసుసూయమ్మ, మనుమరాలు సాయివాణి ఆటో డ్రైవర్ రెడ్డెప్పరెడ్డి గాయపడ్డారు. వారిని మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

80 లిక్కర్ బాటిళ్లు స్వాధీనం

వీరబల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గడికోట పంచాయతీ యడబల్లిలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాప్‌లో ఎస్ఐ నరసింహారెడ్డి దాడులు నిర్వహించారు. 80 లిక్కర్ బాటిళ్లు స్వాధీనం చేసుకొని బెల్ట్‌షాపు యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అంజన్న పవిత్రోత్సవాలు



పవిత్రోత్సవాల్లో హోమపూజలు నిర్వహిస్తున్న దృశ్యం

చక్రాయపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గండిక్షేత్రంలో కార్తీకమాసం పురస్కరించుకొని జరుగుతున్న పవిత్రో త్సవాలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య, పాలక మండలిచైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. సోమవారం 2వ రోజు ఆలయ ప్రధాన అర్చకులు కేసరి, ఉపప్రధాన అర్చకులు రాజారమేష్ నేతృత్వంలో తిరుమలకు చెందిన పండితులు బీవీ రామానుజాచార్యులు వారి శిష్య బృందంచే వేదమంత్రోచ్చారణతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ వెంకటస్వామి, సహాయ అర్చకులు రఘుస్వామి, వేదపారాయణదార్ రామ్మోహన్‌శర్మ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



రాజంపేట టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండలం బోయనపల్లెలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి కల్యాణం సోమవారం టీటీడీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. తాళ్లపాక ముఖద్వారం పక్కన 108 అన్నమయ్య విగ్రహం సమీపంలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా సాయంత్రం టీటీడీ ప్రధాన అర్చకులు రాజేష్ బట్టర్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా స్వామివారిని వివిధ పుష్పాలతో అలంకరించి కల్యాణం నిర్వహించారు. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు పట్టణ, మండల పరిధిలోని భక్తులతో ఆలయం కిక్కిరిసిపోయింది. కార్యక్రమానికి శ్రీశైలం దేవస్థాన చైర్మన్ పోతుగుంట రమేశ్ నాయుడు, రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ చమర్తి జగన్‌మోహన్ రాజు, టీటీడీ డిప్యూటీ ఈవోలు ప్రశాంతి, శివప్రసాద్, ఎస్ఈ మనోహర్, సూపరింటెండెంట్ మస్తానయ్య, తాళ్లపాక గ్రామస్థులు ఉద్దండం సుబ్రహ్మణ్యం, జవ్వాజి అదృష్టదీపుడు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐలు నాగార్జున, ప్రసాద్‌బాబు సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

సబ్సిడీ శనగలకు ఆసక్తి చూపని రైతులు

మార్కెట్ ధరకు, సబ్సిడీ ధరకు వ్యత్యాసం లేకపోవడమే...



శనగ పంట సాగు చేస్తున్న దృశ్యం



శనగ విత్తనాలు

రాజుపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రబీలో ప్రధాన పంటగా సాగు చేసే శనగ రైతులకు ప్రభుత్వం సబ్సిడీతో విత్తనాలు అందజేస్తుంది. ఈ ఏడాది సబ్సిడీ శనగలకు రైతన్నలు పెద్దగా మొగ్గు చూపడం లేదు. దీనికి బయట మార్కెట్‌లో లభించే శనగలకు, సబ్సిడీతో అందజేసే వాటి ధరకు తక్కువ వ్యత్యాసం ఉండడంతో రైతులు ఆసక్తి కనబరచడం లేదు. మండలంలో 12వేల ఎకరాల పైబడి శనగపంట సాగు చేసేందుకు రైతన్నలు పంట పొలాలను సిద్ధం చేశారు. అందుకు గాను ప్రభుత్వం 2800 క్వింటాళ్ల శనగ విత్తనాలను మండలానికి అలాట్‌మెంట్ చేసింది. అయితే రైతన్నకు సబ్సిడీ పోను క్వింటా రూ.5800 ధర నిర్ణయించారు. బయట మార్కెట్‌లో కూడా అదే రేటుకు విత్తనాలు దొరుకుతుండడంతో సబ్సిడీ శెనగలకు రైతులు పెద్దగా మొగ్గు చూపడంలేదు. 2800 క్వింటాళ్లకు గాను 600 క్వింటాళ్లకు మాత్రమే రైతులు నమోదు చేసుకున్నట్లు ఏవో శివరామక్రిష్ణారెడ్డి తెలిపారు. తెలిపారు.

కుందూ వరద ఉధృతికి...

- 690 హెక్టార్లలో పంట నష్టం
- తీవ్రంగా నష్టపోయిన రైతులు



నీటిలో ఉన్న జొన్న పంట

రాజుపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో ఎగువన కురిసిన వర్షాలకు కుందూ నదిలో భారీగా వరద నీరు ప్రవహించింది. దీంతో నదికి ఇరువైపులా సాగైన పంటలు మునకకు గురై రైతులు తీవ్రంగా నష్టపోయారు. వ్యవసాయాధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదకలు పంపారు. ఈ ప్రకారం మండలంలో వరి 28 హెక్టార్లు, పత్తి 19 హెక్టార్లు, కంది 11.50, మినుము 630 హెక్టార్లతో పాటు మొక్కజొన్న, జొన్న పంటలు దెబ్బతిన్నట్లు వచ్చినట్లు గుర్తించారు. అయితే మినుము పంట రబీలో సాగు చేయడంతో ఆ రైతన్నలకు ఉచితంగా 126 క్వింటాళ్ల మినుములు అందిస్తున్నట్లు తెలిపారు. మిగతా 60 హెక్టార్ల పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తుందని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మదనపల్లె అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):రోడ్డు ప్రమాదంలో గాయపడి తిరుపతిలో చికిత్స పొందుతూ విజయకుమార్ (47) అనే వ్యక్తి సోమవారం రాత్రి మృతి చెందాడు. తాలుకా పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లె మండలం సీటీఎంకు చెందిన రమణ కుమారుడు విజయకుమార్ (47) తరిగొండలోని ఆస్పత్రిలో ఆయుష్ కాంపౌండర్‌గా పని చేస్తున్నాడు. గత నెల 25న సీటీఎం నుంచి మదనపల్లెకు బైక్‌పై వస్తూ చెట్టుకు ఢీకొని గాయపడ్డారు. అతను తిరుపతిలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందా డు. తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఎట్టకేలకు పింఛన్లు పంపిణీ

సింహాద్రిపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాళమ్మ గూడూరులో ఎట్టకేలకు పింఛను డబ్బులు సోమవారం అధికారులు పంపిణీ చేశారు. వివరాల్లోకెళితే... అంకాళమ్మగూడూరు సచివాలయ పరిధిలోని రైతు సేవా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న విలేజ్ హార్టీకల్చర్ అసిస్టెంటు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఈనెల 1వ తేదీ పింఛను డబ్బులు రూ.6లక్షల 25వేలు పెన్షన్‌దారులకు పంపిణీ చేయకుండా పరారైన విషయం పాఠకులకు విధితమే. దీంతో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం తెలియజేశారు. దీంతో స్పందించిన కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీ ప్రభుత్వానికి నివేదికలు పంపి పెన్షన్‌కు కావాలసిన నిధులు మంజూరు చేయించినట్లు ఎంపీడీఓ తెలిపారు. పింఛన్లు పంపిణీ చేయడంతో పెన్షన్ దారులు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రారంభమైన శాఖల వారీ సమీక్ష

కడప ఎడ్యుకేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైవీయూలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి శాఖల వారీగా సమీక్షలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు సైన్స్ విభాగాలపై జరిగే ఈ సమీక్షల తొలిరోజున కెమిస్ట్రీ, ఫిజిక్స్, మ్యాథమేటిక్స్, జియాలజీ శాఖలను ఆయన పరిశీలించారు. విభాగాధిపతులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ల ద్వారా తమ శాఖలలో జరుగుతున్న పరిశోధనలు, ప్రాజెక్టులు, పేటెంట్లు, విద్యార్థుల ప్రగతి వివరించారు. శాఖల బలహీనతలు, బలాలను గుర్తించి అభివృద్ధి దిశగా ముందుకు సాగేందుకు వైస్ చాన్సలర్ సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, సైన్స్ అకాడమిక్ డీన్ ఆచార్య ఏజీ దాము, ఐక్యూ ఏసీ సంచాలకుడు డాక్టర్ ఎల్.సుబ్రహ్మణ్యం శర్మ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

వీరబల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాయచోటి మాసాపేటలో జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ గేమ్స్‌లో పెద్దివీడు రెడ్డివారిపల్లె హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివయ్య తెలిపారు. అండర్-17 విభాగంలో వెంకట నరసింహ, రాజేశ్, అండర్-14 బేస్‌బాల్‌లో మణికంఠ ప్రతిభ చూపినట్లు తెలిపారు.

ప్రోత్సాహం ఉంటే ప్రపంచ దిగ్గజాలు తయారవుతారు



మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ విజేతగా నిలిచిన సందర్భంగా పులివెందులలో నిర్వహిస్తున్న ర్యాలీ

పులివెందుల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడల్లో తగిన ప్రోత్సాహం అందిస్తే ప్రపంచ దిగ్గజాలు తయారవుతారని పులివెందుల అర్బన్ ఎస్ఐ సుబహాన్ పేర్కొన్నారు. ప్రపంచకప్ మహిళా క్రికెట్ విజేతగా భారతదేశ జట్టు నిలిచిన సందర్భంగా పులివెందులలో ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రపంచ మహిళా జట్టు క్రికెట్ విజయం స్ఫూర్తిదాయమన్నారు. ఈ జట్టులో ఉన్న మన కడప జిల్లా ముద్దుబిడ్డ శ్రీచరణికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. శ్రీచరణిని ప్రోత్సహించిన కుటుంబ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ బాలనారాయణ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనీత, జేవీవీ జాతీయ కార్యదర్శి సనావుల్లా, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, విద్యార్థినులు పాల్గొన్నారు.

దొర్రి చెరువుకు.. వెలిగల్లు నీరు


గంగకు పూజలు చేస్తున్న మాతానందగిరిస్వామి

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె గ్రామానికి తాగు నీరు అందించే దొర్రిచెరువుకు సోమవారం వెలిగల్లు నీరు చేరింది. దీంతో సోమవారం మాతాంగ పీఠాధిపతి మాతానందగిరి స్వామి గంగకు పూజలు నిర్వహించి ఆరాదన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల పాటు తాగునీరు సమస్య ఉండదని ఆయన అన్నారు. కాగా వెలిగల్లు ప్రాజెక్టు నుంచి కుడికాలువ ద్వారా రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలాలకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆగస్టులో నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ మోహన్‌రెడ్డి, మాతాంగ పీఠాధిపతి భక్తులు పాల్గొన్నారు.

టెట్‌పై రివ్యూ పిటీషన్ వేయాలి

● ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి

సుండుపల్లె, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ టీచర్లు కూడా టెట్ పాస్ కావాలని సూచిస్తూ రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసిన జీవో నెంబర్ 36ను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు అంకం శివారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని పలు ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటీషన్ వేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ అధ్యక్షుడు మున్వర్‌బాషా, సీనియర్ నాయకులు రవీంద్రనాధ్‌రెడ్డి, ఆంజనేయులు, ఇస్మాయిల్, బీమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

అడవిపందుల నుంచి రక్షణ కల్పించండి

● ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి


పీజీఎస్ఆర్‌లో జేసీకి ఫిర్యాదు చేస్తున్న రైతు సంఘం నాయకులు

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అడవి పందుల బెడద నుంచి రైతులు సాగు చేసిన పంటలకు రక్షణ కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఏపీ రైతు సంఘం రాయచోటి ఏరియా అధ్యక్షుడు హరినాధనాయుడుతో కలిసి జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిల్లా పరిధిలోని మదనపల్లి, తంబళ్లపల్లె, రాయచోటి ప్రాంతాల్లో రైతులు సాగు చేసిన పంటలపై అడవిపందులు రాత్రి సమయాల్లో దాడులు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పంట నష్టంపై సంబంధిత అధికారులు ఆయా మండలాల్లో సర్వే చేయాల్సిన అవసరం ఉందన్నారు.

సేంద్రియ పంటలతో ఆరోగ్యానికి మేలు

రామాపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సేంద్రియ పద్ధతులతో పండించిన కూరగాయలు శ్రేష్ఠంగానూ, చౌకగానూ ఉంటాయని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అన్నారు. సోమవారం మండల పరిధిలో ప్రకృతి వ్యవసాయ రీతిలో పండించిన కూరగాయలను స్టాల్స్ ఏర్పాటు చేసి విక్రయించారు. ఈ కూరగాయలకు విశేష స్పందన లభించింది. కూరగాయలు పెట్టిన గంటలోపే పూర్తిగా అమ్ముడుపోయాయి. ప్రతి సోమవారం మండల కేంద్రంలో ఈ విధంగానే విక్రయిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, వెంకటరమణ, కిరణ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ మెటీరియల్ ఆవిష్కరణ

సిద్దవటం నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహం ఇవ్వడమే ఎన్ఎంఎంఎస్ పరీక్ష ఉద్దేశ్యమని మండల రెవెన్యూ అధికారి తిరుమలబాబు తెలిపారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు, మాజీ శాసనమండలి సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు రూపొందించిన ఎన్ఎంఎంఎస్ పరీక్ష స్టడీ మెటీరియల్‌ను సోమవారం ఆయన స్థానిక తహసీల్దారు కార్యాలయంలో జేవీవీ, యూటీఎఫ్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు షామీర్‌బాషా, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, డాక్టర్ హరి పాల్గొన్నారు.

త్రేతేశ్వర ఆలయ ఈవోపై ఆగ్రహం

రాజంపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసోత్సవం సందర్భంగా రాజంపేట మండలంలో త్రేతేశ్వర ఆలయంలో శ్రీశైలం దేవస్థానం చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు ఆలయ ఈవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేక పూజా, అభిషేక కార్యక్రమాలకు వెళ్లిన పోతుగుంటకు ప్రొటోకాల్ నిబంధన పాటించకుండా ఈవో నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

లైబ్రరీకి 50 పుస్తకాలు వితరణ


పుస్తకాలను అందజేస్తున్న శివశంకర్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏపీ మోడల్ స్కూల్‌కు దాత, లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ వెంకటసుబ్బయ్య 50 పుస్తకాలను వితరణ చేశారు. వాటిని సోమవారం ఏపీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వరాల రమేశ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పుస్తకాలు జ్ఞానోదయాన్ని అందజేస్తాయని, ప్రతి విద్యార్థి పుస్తకాలు చదివి గొప్ప వక్తలు కావాలన్నారు. మీ జీవితం మీ చేతుల్లో అనే పుస్తకాలను వారు పాఠశాలకు అందజేశారు. ఈ పుస్తకం విద్యార్థి దశ నుంచే ఎంతో మార్పు తెస్తుందని ప్రతి విద్యార్థి ఈ పుస్తకాలను ఖచ్చితంగా చదవాలని ప్రిన్సిపాల్ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు నాగయ్యలు పాల్గొన్నారు.

హరోం.. హర...

● శివనామస్మరణతో హోరెత్తిన శివాలయాలు

● వైభవంగా రెండో కార్తీక సోమవారం


వీరభద్రాలయంలో అర్ధనారీశ్వరుడి అలంకారంలో అఘోరలింగేశ్వరుడు

రాయచోటిటౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఉత్సవాల్లో భాగంగా రెండవ సోమవారం రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో గల అఘోర లింగేశ్వరుడు అర్ధనారీశ్వర అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా స్వామి వారిని అలంకరించారు. అనంతరం కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రైల్వేకోడూరు: పట్టణంలోని భుజంగేశ్వరస్వామి ఆలయంలో దేవతామూర్తులకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు ఆలయ అర్చకులు పవన్‌కుమార్‌శర్మ, దూర్జటి యోగీలు చేశారు. ఆలయంలో ఉన్న వినాయకుడు, సుబ్రహ్మణ్యం, దక్షిణామూర్తి, నందీశ్వరుడు, చండికేశ్వరుడు తదితర దేవతామూర్తులకు భక్తులు పూజలు చేశారు. కాగా భక్తులకు అల్పాహారంతో పాటు మధ్యాహ్నం టీడీపీ యువ నాయకుడు పోకల మణి అన్నదానం చేయించి పంపిణీ చేశారు. టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మీ, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ పఠాన్ మౌలా, కూటమి నాయకులు తిమ్మిశెట్టిపల్లె మణి, నార్జాల హేమరాజ్, కొప్పరపు అరవింద్, మహిళా నాయకురాళ్లు చెంగమ్మ, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి: కార్తీకమాసం రెండో సోమవారం తెల్లవారుజాము నుంచే శివనామస్మరణతో శివాలయాలు హోరెత్తాయి. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి స్వామివార్లను దర్శించుకున్నారు. స్థానిక శివాలయం, నక్కలపల్లె శంకరభవాని ఆలయం, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, పాత చిట్వేలి, భద్రకాళి ఆలయంలో ఉదయం పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

పెనగలూరు: కార్తీకమాసంలో పవిత్రమైన రెండో సోమవారం రోజున మండలంలోని పలు శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం భక్తులు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టి భక్తిని చాటుకున్నారు. ఆలయాల నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సిద్దవటం: మండల పరిధిలోని లంకమల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజస్వామి ఆలయంలో సిద్దవటేశ్వర శివాలయంలో, కపర్దీశ్వరాలయంలో, జ్యోతిలింగేశ్వరస్వామి ఆలయం, నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కార్తీక రెండో సోమవారం పురస్కరించుకుని వైభవంగా పూజలు నిర్వహించారు. ఆలయాల్లో భక్తులు దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. రాజంపేట నియోజకవర్గం జనసేన సమన్వయకర్త అతికారి కృష్ణ కపర్థీశ్వరస్వామి కోనలో పూజలు నిర్వహించారు.

నిత్యపూజకోనకు భక్తుల తాకిడి

లంకమల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజేశ్వరకోనకు భక్తుల రద్దీ పెరగడంతో ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీఐ బాబు ఆధ్వర్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలంలోని వంతాటిపల్లె గ్రామం లంకమల్ల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజేశ్వరకోనకు కార్తీక రెండో సోమవారం సందర్భంగా భక్తుల రద్దీ పెరగడంతో ఎస్ఐ సుబ్బరామచంద్ర, హెడ్‌కానిస్టేబుల్ రమణ, స్థానిక పోలీసులు రామకుమార్, శివ బందోబస్తులో పాల్గొన్నారు.

గాలివీడు: కార్తీక మాసం సందర్భంగా మండలంలోని గండిమడుగు పుణ్యక్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహించారు. రెండవ సోమవారం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆలయంలో పూజలు నిర్వహించారు. అంతేగాక మహిళలు, చిన్నారులు కార్తీక దీపాలు వెలిగించి సామూహిక వ్రతాలు నిర్వహించారు.

రామాపురం: మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ప్రధానంగా హసనాపురం వద్ద ఉన్న శివాలయంలో ఉదయం, రాత్రి వేళల్లో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంది. బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా శివాలయాల్లో కార్తీక దీపాలు వెలిగించుకునేందుకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.



రైల్వేకోడూరులో భక్తులకు అల్పాహారం పంపిణీ చేస్తున్న ముక్కా వరలక్ష్మీ, చిట్వేలిలో తమలపాకు అలంకరణలో శ్యామలాంబదేవి

ఘనంగా అయ్యప్పస్వామి మాలదీక్ష పూజలు


బియ్యం ప్యాకెట్లను అందించిన దృశ్యం

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లెలోని అయ్యప్పస్వామి మాలధారణ గురుస్వాములు వెంకట్రమణ, వెంకటేశ్వర్లు ఏర్పాటు చేసిన అయ్యప్పస్వామి మాలదీక్ష పూజలు సోమవారం వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. అయ్యప్పస్వామి విగ్రహాన్ని గొల్లపల్లి నుంచి వెంకటేశ్వర దేవాలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి మేనల్లుడు మౌర్యారెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు యనమల మదన్‌మోహన్ దీక్షలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిఏటా శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలాలకు చెందిన అయ్యప్పస్వామి భక్తులకు ఇక్కడే బస, భిక్ష ఏర్పాటు చేస్తున్నారు.

10 బియ్యం ప్యాకెట్లు వితరణ

అయ్యప్ప భక్తులకు భిక్ష (అన్నదానం) చేసేందుకు 10 ప్యాకెట్ల బియ్యాన్ని భక్తులు వితరణగా అందించారు. వీటిని వసంత కృష్ణమోహన్‌రెడ్డి, గురుస్వాములు సెల్లు గంగరాజు, వెంకటేశ్వర్లకు అందించారు. అదేవిధంగా రాయచోటి వెంకటేశ్వర ఐటీఐ కరస్పాండెంట్ రామరాజు 100 కిలోల ఆయిల్‌ను, దప్పేపల్లికి చెందిన వసంత కార్తీక్‌రెడ్డి రూ.10 వేలు, అయ్యప్ప భక్తులకు పాలు, పెరుగు కింద డబ్బులు అందజేశారు.

వైభవంగా పడికట్ల పూజ

పెనగలూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెనగలూరు గ్రామంలో ఆదివారం రాత్రి అయ్యప్పస్వామి పడిగట్ల పూజా కార్యక్రమం వైభవంగా జరిగింది. కోడూరు శ్రీనివాసులు, సరస్వతమ్మ నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది.

'వీధికుక్కలకు రేబిస్ టీకాలు వేయాలి'

రాయచోటిటౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని పలు వీధుల్లో సంచరించే వీధి కుక్కలకు రేబీస్ టీకాలు వేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేశ్ సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వ అధికారులను కోరారు. ఈ మధ్యకాలంలో ఇంట్లో పెంచుకుంటున్న పెంపుడు కుక్కలు సైతం కరవడంతో ఎంతో మంది రేబిస్ వ్యాధికి గురై చనిపోతున్న సంఘటనలు చూస్తున్నామన్నారు.

విద్యార్థులు నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకోవాలి

చిట్వేలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు వివిధ నైపుణ్యాల్లో వృద్ధి సాధించాలని ప్రధానోపాధ్యాయుడు దుర్గరాజు పేర్కొన్నారు. సోమవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థులకు వృత్తి విద్య నైపుణ్య పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్నబాబు, రఫీ, నాగమణి, సుభాష్ చంద్రబోస్, వెంకటరమణ, సోఫియా పాల్గొన్నారు.

ధైర్య సాహసాలకు ప్రతీకలు గైడ్ కెప్టెన్లు

● లీడర్ ఆఫ్ ది కోర్స్ కస్తూరి సుధాకర్ వెల్లడి


మాట్లాడుతున్న కస్తూరి సుధాకర్

రాయచోటిటౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): బాలికలకు ఆదర్శప్రాయులు, ధైర్యసాహసాలకు ప్రతీకలు గైడ్ కెప్టెన్లని శిక్షణలో పాల్గొన్న లీడర్ ఆఫ్ ది కోర్స్ కస్తూరి సుధాకర్ అన్నారు. రాయచోటి పట్టణంలోని డైట్ కేంద్రంలో సోమవారం నుంచి ప్రారంభమైన బేసిక్ గైడ్ కెప్టెన్ల 7 రోజుల రెసిడెన్షియల్ శిక్షణా కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ నరసింహారెడ్డి, అడ్వాన్స్ గైడ్ కెప్టెన్లు సుజాత, జిల్లాలోని 55 మంది బేసిక్ గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు.

వేడుకలు నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న పీవీఎస్‌నాయుడు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గిరిజన నాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు భగవాన్ బిర్సా ముండా పేరున ఈ నెల 1 నుంచి 15వ తేది వరకు జన్ జాతీయ గౌర దినోత్సవం వేడుకలు నిర్వహించాలని గిరిజన సంక్షేమశాఖ రాష్ట్ర డైరెక్టర్ టీవీఎస్‌నాయుడు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో అన్నిశాఖల అధికారులకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో వెనుకబడిన గిరిజన ప్రాంతాలను గుర్తించి ప్రభుత్వం వాటి అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. అలాగే లక్కిరెడ్డిపల్లె మండలంలోని బి.యర్రగుడి గ్రామాన్ని ఎంపిక చేశామని, ఈ గ్రామాలను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ అధికారిని తేజస్వి, ఎంపీడీవో రెడ్డయ్య, ఈవోపీఆర్డీ ఉషారాణి, పంచాయతీ సెక్రటరీ సుదర్శన్‌రెడ్డి, నాగమణి, రజనీస్‌రెడ్డి, వెంకట్రమణ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను పరామర్శించిన లక్ష్మిప్రసాద్‌రెడ్డి

రామాపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన కార్యకర్తలను మంత్రి సోదరుడు, నియోజకవర్గం టీడీపీ నాయకుడు లక్ష్మిప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. మండలంలోని రాచపల్లి పంచాయతీ బాలిరెడ్డిగారిపల్లెకు చెందిన టీడీపీ కార్యకర్తలు శివారెడ్డి, మోహన్‌రెడ్డిలను సోమవారం ఆయన పరామర్శించారు. ఆయన వెంట రాచపల్లి టీడీపీ నాయకులు గంగిరెడ్డి, రాంమోహన్‌రెడ్డి, మదన్‌మోహన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలపై ఫిర్యాదు

రైల్వేకోడూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు పాటించడం లేదని, వాటిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు లతీఫ్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నిషాంత్‌కుమార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలి


కలెక్టరేట్ వద్ద నిరసనలో మహిళలు

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని బేతల్‌కాలనీ 10వ వార్డులో అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేశారు. అనంతరం జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మర్రి సుమిత్ర మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య నియోజకవర్గ కార్యదర్శి లక్ష్మిదేవి, మహిళలు పాల్గొన్నారు.

'ఇంటి స్థలాలు కేటాయించాలి'

రైల్వేకోడూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని దళిత గ్రామాల్లో ప్రజలకు ఇంటి స్థలాలు కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాధవరంపోడు అరుంధతివాడ గ్రామస్థులు రేణుక, సుబ్బమ్మ, రవణమ్మ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల ర్యాలీ


విభిన్న ప్రతిభావంతుల ర్యాలీ

రాజంపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ విభిన్న ప్రతిభావంతులు సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ట్రైసైకిళ్లతో ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతులు మాట్లాడుతూ రాజంపేట పార్లమెంటరీ నియోజవర్గ కేంద్రంగా సబ్‌కలెక్టర్ కార్యాలయ కేంద్రంగా ఎన్నో ఏళ్లుగా కొనసాగుతుందన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

● చమర్తి జగన్‌మోహన్‌రాజు

ఒంటిమిట్ట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులకు అందుబాటులో ఉండి సకాలంలో వారికి రుణాలను మంజూరు చేయించాలని రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. సోమవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో చెర్లోపల్లె పీఏసీఎస్ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి రాజంపేట జనసేన నాయకుడు అతికారి కృష్ణతో కలిసి ఒంటిమిట్టకు విచ్చేశారు. ఈ సందర్భంగా సింగిల్ విండో అధ్యక్షుడిగా మాడా జయకృష్ణ, సభ్యులుగా బొడిచెర్ల శ్రీనివాస్, మౌలాలితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు సేవ చేసి మీపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో కోఆపరేటివ్ డిప్యూటీ రిజిస్టర్ గోపికృష్ణ, జడ్పీటీసీ ముద్దు కృష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, క్లస్టర్ కన్వీనర్ ఈశ్వరయ్య, పార్టీ సీనియర్ నాయకులు ఎస్వీ రమణ, బొబ్బిలి రాయుడు, వేణుగోపాల్‌రాజు పాల్గొన్నారు.



సుండుపల్లెలో.. ట్రాఫికర్

● వాహనదారులకు తప్పని ఇబ్బందులు

● రోడ్లపై ఆటోలు, తోపుడుబండ్లు, పూలఅంగళ్లు



సుండుపల్లె, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ట్రాఫిక్ కష్టాలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపైనే ఆటోలు, తోపుడు బండ్లు, పూలఅంగళ్లతో రద్దీగా ఉంటోంది. మండల కేంద్రంలో సుమారు 5 వేలకు పైగా గృహాలు ఉన్నాయి. సుమారు రెండు కి.మీ. వరకు విస్తరించి వున్న మండల కేంద్రానికి నలుమూలల నుంచి రైతులు, ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థినీ, విద్యార్థులు వస్తుంటారు. 15 గ్రామ పంచాయతీలతో కూడిన అతి పెద్ద మండలం కావడంతో వాహనాలు అధికంగా రాకపోకలు జరుగుతుంటాయి. సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు ట్రాఫిక్ కష్టాలు మితిమీరిపోతున్నాయి. పోలీసులు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా నియంత్రించాల్సి ఉంది.

అన్నీ ఆక్రమణలే

మండల కేంద్రంలో అన్ని ఆక్రమణలే.. గదులు, బిల్డింగ్‌ల యజమానులు, బాడుగలకు తీసుకున్న వ్యక్తులు తమ ఇండ్లు, షాపుల ముందు చిరువ్యాపారులకు రోజు వారి కూలీ తీసుకొని అదనంగా షాపులు పెట్టించడం వలన ఆక్రమణలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. వారికి తోడు చికెన్, మటన్ షాపుల వద్ద ద్విచక్రవాహనాలు నిలిపివేయడం, చికెన్, మటన్ షాపుల నుంచి వచ్చిన వ్యర్థాలను రోడ్ల మీదకు వేయడం, రక్త మాంసాలను రోడ్ల మీదకు వదలడం వలన శునకాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇదంతా పంచాయతీ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. ఎవరైనా జిల్లా పంచాయతీ అధికారులు వస్తే ఆ రోజు హడావిడి చేసి చేతులు దులుపుకుంటున్నారు.

అధికారుల సహకారం అవసరం

- శ్రీనివాసులు, ఎస్ఐ, సుండుపల్లె

మండల కేంద్రంలో ఉదయం, సాయంత్రం పోలీసు సిబ్బందిని పంపించి ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూస్తున్నాం. ఇండ్లు, షాపుల ముందు అదనపు బండ్లు పెట్టించి బాడుగలు వసూలు చేయడం వలన ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారింది. పంచాయతీ అధికారులు, రెవెన్యూ అధికారులు ఆక్రమణలు తొలగిస్తే ట్రాఫిక్ సమస్య ఉండదు. వారి నుంచి సహకారం అవసరం.

నోటీసులు జారీ చేశాం

- సురేశ్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవో

మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై చికెన్, మటన్ షాపులతో పాటు పూల అంగళ్లు సంతగేటులో పెట్టుకోవాలని, ప్రధాన రహదారిపై పెట్టరాదని నోటీసులు జారీ చేశాం. రాజకీయ నాయకులతో ఒత్తిడి వస్తోంది. ఆక్రమణలను తొలిస్తాము. అదనపు అంగళ్లు పెడితే చర్యలు తీసుకుంటాము.

తాళం పగులగొట్టి ఇంట్లో చోరీ

గుర్రంకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి బంగారం , వెండి ఆభరణాలు అపహరించుకు వెళ్లిన సం ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని కొత్తపేటలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న వసీమ్ అక్రమ్ గత నెల 28న ఇంటికి తాళం వేసి బెంగుళూరుకు వెళ్లాడు. సోమవారం మధ్యాహ్నం తిరిగి వచ్చిన అతను తాళం పగులగొట్టి ఉండడం గమనించాడు. దీంతో లోపలికి వెళ్లి చూడగా బీరువా పగిలిపోయి.. అందులోని దుస్తులు చిందర వందరగా పడి ఉండడం కనిపించింది . బీరువాలోని అరలను ఇనుప రాడ్డుతో ధ్వంసం చేసి అందులోని 10 గ్రాముల బంగారం, 100 గ్రాముల వెండి ఆభరణాలను తీసుకెళ్లినట్లు గుర్తించాడు. చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్లూస్ టీమ్‌ను పిలిపించి వేలి ముద్రలను సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ గజేంద్ర తెలిపారు.

బాలిక అదృశ్యం

రామసముద్రం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎలవానెల్లూరు పంచాయతీ ఎ.కొత్తూరు గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్లు కేసు నమోదు చేశామని ఎస్ఐ రమేశ్‌బాబు తెలిపారు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నవంబరు 2వ తేదీ నుంచి ఇంటి నుంచి వెళ్లిన బాలిక తిరిగి రాలేదని పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు. ఫిర్యాదు ఆధారంగా మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేరు కాపురం పెట్టలేదని మహిళ ఆత్మహత్య

రాయచోటి-నేతాజీ సర్కిల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేరుకాపురానికి భర్త అంగీకరించలేదని మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు దేవపట్ల గ్రామం అంబేద్కర్‌నగర్ కాలనీకి చెందిన దేవరింటి కన్నయ్య నాలుగో కూతురు మౌనిక (25)కు రెండేళ్ల క్రితం కడప జిల్లా అట్లూరు మండలం ఎస్. వెంకటాపురానికి చెందిన సునీల్‌తో వివాహమైంది. వీరికి ఆరు నెలల కుమారుడు ఉన్నాడు. వేరు కాపురం విషయమై భర్తతో గొడవపడిన మౌనిక రెండు నెలల క్రితం పుట్టింటికి చేరుకుంది. ఆదివారం ఆమె వాంతులు చేసుకోవడంతో గుర్తించిన తల్లిదండ్రులు విషం తాగినట్లు గుర్తించి రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, ప్రాథమిక చికిత్స అనంతరం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిందని, ఈ మేరకు మృతురాలి తండ్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

స్థలం వివాదంలో.. ఇరువర్గాలకు కౌన్సెలింగ్

రైల్వేకోడూరురూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థలం విషయంలో రెండు వర్గాలు ఘర్షణ పడడంతో పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. కోడూరు పట్టణంలోని సర్వే నెంబర్లు 5,7,13 ను కొందరు వ్యక్తులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అదే సర్వే నంబర్లు సుమారు 100 మందికి పైగా రిజిస్ట్రేషన్ అయ్యాయి. అయితే, దళిత వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు ఆర్ఎస్ఆర్‌లో తమ పూర్వీకుల పేర్లు ఉన్నాయని ఆ భూమి తమకే చెందుతుందంటూ ఇతరులను ఈ స్థలం వద్దకు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ విషయంపై రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు పలుసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం కనిపించలేదు. దీంతో సోమవారం స్థలం వద్దకు వెళ్లిన వారిపై దళిత వర్గానికి చెందినవారు దాడి చేయడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ కే.అమర్నాథ్, సీఐ కే.హేమసుందర్ రావు ఇరువర్గాల వారిని కోడూరు తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. రికార్డులను పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఇరువర్గాల వారిని బైండోవర్ చేశారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

17 నుంచి కుష్ఠువ్యాధిపై సర్వే


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి(నేతాజీ సర్కిల్), నవంబరు3(ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధి పై ప్రజల్లో అపోహలను తొలగించడంతోపాటు, బాధితులకు చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంపై రూపొందించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి 30 వరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కుష్ఠువ్యాధి బాధితులను గుర్తించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంగవైకల్య నివారణకు ఈ సర్వే ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రాథమిక దశలనే బాధితులను గుర్తించి వైద్య సేవలు అందిస్తే వ్యాధి పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రతి ఒక్కరికీ కుష్ఠువ్యాధి పరీక్షలు చేయాలని ఆదేశించారు. పాఠశాలలు, సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాల విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయాలని ఆదేశించారు. సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఎంహెచ్‌వో లక్ష్మీనరసయ్య, జిల్లా టీబీ అధికారి రాధిక, మెడికల్ ఆఫీసర్ విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచాలి: జేసీ

రాయచోటి(నేతాజీసర్కిల్), నవంబరు3(ఆంధ్రజ్యోతి): రైతులకు సుస్థిర వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచాలని, వ్యవసాయంలో పీ4 అమలు చేసి ఆదర్శ రైతులను మార్గదర్శకులుగా చూపించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులకు సూచించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో భూమాత రక్షణ కార్యక్రమంపై జిల్లా స్థాయి కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యసాయాఖ అధికారి కార్యక్రమంలోని వివిధ అంశాలను వివరించారు. భూసారం పెంపు, ఎరువుల వాడకాన్ని తగ్గించడం, రైతుల్లో సుస్థిర వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంపొందించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఎరువుల వినియోగాన్ని తగ్గించడంపై రైతులకు అవగాహన కల్పించేందుకు కృషి విజ్ఞాన కేంద్రం అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ, భూమాత రక్షణ కార్యక్రమం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మీరైనా పట్టించుకోండి మేడం

- పరిహారం చెల్లింపులో జాప్యంపై భూ నిర్వాసితుల వినతి


వృద్ధురాలి సమస్య తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్ కళ్యాణి

మదనపల్లె టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అవసరాలకోసం సేకరించిన భూమికి సంబంధించి నష్టపరిహారం చెల్లింపులో జాప్యం చేస్తున్నారు.. మీరైనా పట్టించుకుని న్యాయం చేయండి మేడం అంటూ పలువురు రైతులు సబ్‌కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో సబ్‌కలెక్టర్ చల్లా కల్యాణి ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. పీటీఎం మండలంలో హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ కోసం సేకరించిన భూములకు నష్టపరిహారం చెల్లింపులో జాప్యం చేస్తున్నారని కందుకూరుకు చెందిన సాబ్‌జాన్ సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మదనపల్లె మండలం కోటవారిపల్లె పంచాయతీలో డంపింగ్ యార్డు నిర్మాణానికి తాను రూ.65,275 ఖర్చు చేయగా అధికారులు రూ.37,768 మాత్రమే చెల్లించారని, మిగిలిన సొమ్ము కోసం ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నానని.. సమస్య పరిష్కరించాలని సురేంద్ర అనే వ్యక్తి విన్నవించారు. మదనపల్లె పట్టణ శివారులో కొందరు నకిలీ ఇంటి పట్టాలతో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుంటున్నారని బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మొంథా తుఫాను కారణంగా ములకలచెరువు మండలం సోంపల్లె వద్ద అడవిచెరువుకు గంగి పడి రోడ్డు కోసుకుపోయిందని, దేవలచెరువు రోడ్డు గుంతలమయమైందని, మరమ్మతులు చేయించాలని ఏఐకేఎంఎస్ అధ్యక్షుడు వైవీ రమణ సబ్‌కలెక్టర్‌ను కోరారు. వీటితో పాటు భూ సమస్యలు, సర్వే సమస్యలు, అంత్యోదయ కార్డుల కోసం ప్రజలు అర్జీలు సమర్పించారు. కాగా, సరోజిని అనే వృద్ధురాలు పీజీఆర్ఎస్ హాలుకు వచ్చి నడవలేక కూర్చుండిపోవడాన్ని గమనించిన సబ్‌కలెక్టర్ ఆమె వద్దకు వెళ్లి అర్జీని పరిశీలించి, మెడికల్ రీయింబర్స్‌మెంట్ మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

హైవే పనులకు రూ.85 కోట్ల నిధులు


కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని సన్మానిస్తున్న ముక్కా..

రైల్వేకోడూరురూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కడప - రేణిగుంట నేషనల్ హైవే నిర్మాణ పనులకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి తెలిపారు. సోమవారం ఢిల్లీలోని కేంద్ర రహదారుల మంత్రి నితిన్ గడ్కరీని బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయి లోకేష్‌తో వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భారీ వర్షాల కారణంగా కడప-రేణిగుంట జాతీయ రహదారి తీవ్రంగా దెబ్బతిన్నదని, దీనివల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రోడ్డు పనుల నిమిత్తం నిధులు మంజూరు చేయాలని కోరగా తక్షణమే రూ.85 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు తెలిపారు.

భద్రకాళి, వీరభద్రులకు వెండి కిరీటాలు అందజేత


వెండి వస్తువులను అందజేస్తున్న వీరయ్య కుటుంబ సభ్యులు

రాయచోటిటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయానికి సోమవారం పలువురు దాతలు వెండి కిరీటాలు, వెండి వస్తువులు అందజేసినట్లు ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి తెలియజేశారు. కడప జిల్లా వేంపల్లికి చెందిన వడ్లకుంట వీరయ్య కుమారుడు రాచయ్య జ్ఞాపకార్థం రాజనరసింహారావు వీరభద్రస్వామింకి 2.222 కేజీల వెండి నాగపడగతో కూడిన కిరీటం, వీవీఎల్ఎన్ రోహిత్ భద్రకాళి అమ్మవారికి 981 గ్రాముల వెండి జ్వాలా కిరీటం అందజేశారు. వంకదారి చంద్రశేఖరయ్య జ్ఞాపకార్థం వడ్లకుంట సుభాషిణి వీరభద్రస్వామి ఉత్సవ మూర్తికి 624 గ్రాముల వెండి కిరీటం, ఖడ్గం, 1, ఎడమ చేయి, పాదాలు, డాలు అందజేశారు. వడ్లకుంట విజయలక్ష్మి దేవమ్మ జ్ఞాపకార్థం వడ్లకుంట వైష్ణవి భద్రకాళీ అమ్మవారి ఉత్సవమూర్తికి 413 గ్రాముల వెండి కిరీటం, త్రిశూలం, ఎడమ హస్తం, పాదాలు అందజేశారు. మొత్తం మీద వడ్లకుంట వీరయ్య కుటుంబ సభ్యులంతా కలసి 4.240 కేజీల వెండి వస్తువులను సమర్పించారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు గాలివీడు విద్యార్థి


అయూబ్

గాలివీడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సెపక్ తక్రా పోటీలకు గాలివీడు జడ్పీహైస్కూల్ విద్యార్థి మహమ్మద్ అయూబ్ ఎంపికైనట్లు పీడీ గంగరాజు, ప్రధానోపాధ్యాయుడు కే. జాఫర్‌హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతపురం జిల్లా ఉరవకొండలో నవంబర్ 2, 3 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా క్రీడా పోటీల్లో మహమ్మద్‌అయూబ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యాడన్నారు. అనంతరం అయూబ్ ఎంపికపై హర్షం వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయ బృందం విద్యార్థిని అభినందించింది.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు మోటకట్ల విద్యార్థులు



రాయచోటి - నేతాజీ సర్కిల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ క్రీడా పోటీలకు మోటకట్ల హైస్కూల్ విద్యార్థులు 9 మంది ఎంపికయ్యారని హెచ్ఎం చప్పిడి పద్మజ తెలిపారు. సోమవారం పాఠశాలలో ఆయా విద్యార్థుల అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాఫ్ట్‌బాల్ అండర్-14 విభాగం బాలికల్లో నాగదీపిక, అండర్-17 బాలుర విభాగంలో వెంకట్, మనోజ్, బాలికల విభాగంలో హర్షిత ఎంపికయ్యారన్నారు. బేస్‌బాల్‌లో అండర్-14 బాలికల విభాగంలో మోక్షజ్ఞ, నాగదీపిక, అండర్-17 బాలుర విభాగంలో వెంకట్, బాలికల విభాగంలో హర్షిత ఎంపికయ్యారన్నారు. త్వరలో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను, వారికి శిక్షణ ఇచ్చిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు వేణుమాధవ్‌రాజును పాఠశాల సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చిదంబర్‌రెడ్డి, పద్మావతి, నాగశేషారెడ్డి, నాగేశ్వర్‌నాయక్, భాస్కర్, ప్రసాద్‌రాజు, నరసింహులు, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.


చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

కథే ఈ సినిమాకు హీరో


దేవన్


దేవన్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన సినిమా 'కృష్ణ లీల'. 'తిరిగొచ్చిన కాలం' అనేది ఉపశీర్షిక. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్. జ్యోత్స్న జి నిర్మిస్తున్నారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దేవన్ మీడియాతో ముచ్చటించారు. 'ఇదో సూపర్ నేచురల్ లవ్‌స్టోరీ. కొత్తదనంతో నిండిన ఈ కథను నిర్మాతలకు వినిపించగానే ఓకే చేశారు. కృష్ణుడు ఒక ప్రేమ కథలో తన లీలలు ఎలా చూపిస్తారనేది ఆసక్తికరంగా చూపిస్తున్నాం. మనుషులు ఎలాగూ గడిచిపోయిన కాలాన్ని తిరిగి తీసుకురాలేరు. దైవత్వంతో ఆ కాలాన్ని తిరిగి తీసుకురావడమే చిత్ర కథాంశం. కృష్ణతత్వాన్ని అందరికీ మరింత బాగా అర్థమయ్యేలా ఇందులోని సన్నివేశాలు ఉంటాయి. కథే ఈ సినిమాకు హీరో. ప్రేమలోని గొప్పదనాన్ని అందంగా ఆవిష్కరిస్తుందీ చిత్రం. భీమ్స్ సిసిరోలియో సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. చిత్రం అన్ని వర్గాల వారినీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

నటుడిగా యాభై ఏళ్లు.. 22న భారీ వేడుక!




విలక్షణ నటుడు డాక్టర్ మోహన్‌బాబు నటుడిగా పరిచయమై ఈ ఏడాదికి యాభై ఏళ్లు. ఆయన హీరోగా నటించిన తొలి చిత్రం 'స్వర్గం నరకం' 1975 నవంబరు 22న విడుదల అయింది. ఈ అసాధారణ ప్రయాణాన్ని గౌరవించుకునే క్రమంలో ఈ నెల 22న 'ఎంబీ 50.. ఏ పెర్ల్ నైట్ ట్రిబ్యూట్' అనే పేరుతో ఓ భారీ వేడుకను మంచు విష్ణు నిర్వహించనున్నారు. 'దిగ్గజ నటుడిని, భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకొనేలా ఈ ఈవెంట్ ఉంటుందని మంచు విష్ణు చెప్పారు. ఎలాంటి సినిమా నేపథ్యం లేకపోయినా ఒంటరిగా సినీ ప్రయాణం మొదలు పెట్టి, తనకంటూ ఓ సామ్రాజ్యాన్ని ఏర్పరచుకుని విలక్షణ నటుడిగా ఎదిగిన మోహన్‌బాబు ఎదిగిన జర్నీ గురించి అందరికీ మరోసారి వివరించి చెప్పనున్నారు. ఈ వేడుక పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని మంచు విష్ణు చెప్పారు.

ఉత్తమ నటుడిగా మమ్ముట్టి రికార్డ్!



సోమవారం ప్రకటించిన కేరళ ఫిల్మ్ అవార్డ్స్‌లో మలయాళ చిత్రరంగ సూపర్‌స్టార్ మమ్ముట్టి ఏడోసారి ఉత్తమ నటుడిగా ఎన్నికై అరుదైన రికార్డ్ నెలకొల్పారు. నటుడు ప్రకాశ్‌రాజ్ అధ్యక్షతన ఏర్పాటైన ఏడుగురు సభ్యులున్న జ్యూరీ కమిటీ అవార్డులను ఎంపిక చేసింది. త్రిస్సూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేరళ మంత్రి షాజీ చెరియన్ అవార్డుల వివరాలు వెల్లడించారు. 'భ్రమయుగం' చిత్రంలో నటించిన మమ్ముట్టి ఉత్తమ నటుడిగా ఎన్నికయ్యారు. ఉత్తమ చిత్రంగా 'మంజుమ్మల్ బాయిస్' ఎన్నికైంది. ఉత్తమ దర్శకుడు అవార్డ్ సహా మొత్తం ఎనిమిది అవార్డులతో ఈ సినిమా సత్తా చాటింది. ఉత్తమ నటుడిగా తను మరోసారి ఎన్నిక కావడంపై మమ్ముట్టి వ్యాఖ్యానిస్తూ 'ఇదో ప్రయాణం.. రకరకాల వ్యక్తులతో కలసి చేసే సుదీర్ఘ ప్రయాణం. ఇక్కడ పోటీ అనే పదానికి తావు లేదు' అని అన్నారు.

రాకెట్‌కు బాహుబలి పేరు - రాజమౌళి హర్షం



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఇటీవలె ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ రాకెట్‌కు దాని బరువు, సామర్థ్యానికి తగ్గట్టుగా 'బాహుబలి' అనే పేరు పెట్టడంపై దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి హర్షం వ్యక్తం చేశారు. 'దేశానికి గర్వకారణమైన క్షణం ఇది. మా సినిమా టైటిల్‌తో ఉన్న రాకెట్ ఇంత గొప్ప విజయాన్ని సాధించడం మాకు చాలా ఆనందాన్నిచ్చింది' అని ఇస్రో శాస్త్రవేత్తలను రాజమౌళి అభినందించారు.

సినిమా టిక్కెట్‌ల వివాదంపై సుప్రీం స్టే

మల్టిప్లెక్స్‌లలోని సినిమా టిక్కెట్‌లకు ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలని కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఏకరూప టిక్కెట్ విధానాన్ని (రూ.200 + జీఎస్టీ) ప్రశ్నిస్తూ హొంబలె ఫిల్మ్స్, మల్టిప్లెక్స్‌ల సంఘం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు సింగిల్ జడ్జి మధ్యంతర స్టే ఇచ్చారు. ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. సెప్టెంబరు 30న 'ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలి' అని ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం టిక్కెట్ ధరలపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. మల్టిప్లెక్స్‌లలో వాటర్ బాటిల్‌కు రూ.100 వసూలు చేస్తున్నారని, ఇప్పటికే థియేటర్లకు వచ్చే వారి సంఖ్య తగ్గుతోందనీ, మరింత సహేతుకంగా ధరలను నిర్ణయించాలని, లేకపోతే హాళ్లు ఖాళీగా మారిపోతాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. *బెంగళూరు (ఆంధ్రజ్యోతి)*

మన జీవితాలకు వర్తించేలా ఉంటుంది


దీక్షిత్ శెట్టి

'దసరా', 'దియా' చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న దీక్షిత్ శెట్టి నటించిన తాజా చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. రష్మిక కథానాయికగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించారు. గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్లపై ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈ నెల 7న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు దీక్షిత్ శెట్టి. 'దసరా' సినిమాలో నేను పోషించిన పాత్ర నచ్చి, 'ది గర్ల్‌ఫ్రెండ్'లో నటిస్తారా అని దర్శకుడు రాహుల్ రవీంద్రన్ అడిగారు. ఆయన చెప్పిన స్క్రిప్ట్ నచ్చి వెంటనే అంగీకరించాను. ఇందులో నా పాత్ర పేరు విక్రమ్. నా పాత్ర తీరుతెన్నులు ఎలా ఉంటాయి అనేది చాలా క్లియర్‌గా వివరించేవారు రాహుల్. నా పాత్రకు కొన్ని నెగెటివ్ షేడ్స్ ఉంటాయి. ఇప్పటిదాకా మనం చూసిన ప్రేమకథలన్నీ ఒక తరహాలోనే సాగుతుంటాయి. ప్రేమకథని మరో కోణంలో ఆవిష్కరించే చిత్రమిది. మనందరి జీవితాలకు వర్తించేలా సినిమా ఉంటుంది' అని తెలిపారు.

చకచకా... 'సోలార్' పనులు

- దువ్వూరు వద్ద పవర్‌ప్లాంట్ నిర్మాణం
- 5 మెగావాట్ల విద్యుత్తు ఉత్పాదన లక్ష్యం
- పూర్తయితే రైతులకు ప్రయోజనం



దువ్వూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంట పొలలకు అందించే కరెంటు సరఫరాలో తరచూ అవాంతరాలు ఎదురవుతున్నాయి. దీంతో పొలం పూర్తిగా తడవకముందే ఎదురవుతున్న ఆటంకాలతో అన్నదాతలు ఒకింత ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం చొరవతో జిల్లాలో మైదుకూరు, పులివెందుల, కడప, పోరుమామిళ్ల క్లస్టర్లలో సోలార్ పవర్‌ప్లాంట్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా దువ్వూరులో అయిదు మెగావాట్ల విద్యుత్తు ఉత్పాదన లక్ష్యంగా మెగా కంపెనీ పనులు చేపట్టింది.

దువ్వూరు సమీపంలోని గుట్టప్రాంతమైన సర్వే నంబరు 145లో 25 ఎకరాల ప్రభుత్వ స్థలంలో సోలార్ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. నాలుగు నెలల వ్యవధిలో ఈ పనులను పూర్తి చేసే విధంగా గడువు నిర్ణయించారు. ఇటీవల నెలకొన్న తుఫాను ప్రబావం పనులకు కొంత ఆటంకం ఏర్పడింది. ప్రస్తుతం ఈ పనులు ఊపందుకున్నాయి. రాయితీతో కూడిన గుట్ట ప్రాంతం కావడంతో మిషనరీని ఉపయోగించి సోలార్ ప్యానెల్స్ అమర్చేందుకు వీలుగా రంధ్రాలు వేస్తున్నారు. అయిదు అడుగుల లోతు, ఒక అడుగు వెడల్పుతో రంధ్రాలు ఏర్పరచి అలైన్‌మెంట్, కాలంపోస్టు పనులు చేస్తున్నారు. గత నెల 17వ తేదీన ఈ పనుల తీరుతెన్నులు పరిశీలించేందుకు తిరుపతి నుండి ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ లోతేటి శివశంకర్ ఇక్కడికి వచ్చారు. పనులు చేస్తున్న కంపెనీ ప్రతినిధుల తో మాట్లాడి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ మేరకు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ పవర్‌ప్లాంట్ నిర్మాణం పూర్తయితే రైతులకు ఎంతో ప్రయోజన కరంగా ఉంటుంది.

డిసెంబరు నాటికి కిచెన్ షెడ్లు పూర్తి చేయాలి : కలెక్టర్



వీసీ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

కడప కలెక్టరేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా అమలైన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్ల నిర్మాణాలు డిసెంబరు నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో యూనిక్‌గా ఏర్పాటు కానున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్స్ భవన నిర్మాణాల పురోగతిపై అన్ని డివిజన్ల ఆర్డీవోలు, సంబంధిత అధికారులతో వీసీ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ కడప నగరంలో, సీకేదిన్నెలో స్మార్ట్ కిచెన్‌ల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న బోజన పథకాన్ని మరింత శుచిగా, రుచి కరంగా తాజాగా విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. ఈ స్మార్ట్ కిచెన్లు రాష్ట్రానికి ఆదర్శంగా ఉన్నాయన్నారు. ఇదే స్ఫూర్తితోనే జిల్లాలో నూతనంగా 33 స్మార్ట్ కిచెన్ షెడ్లను ఏర్పాటు చేస్తున్నామని, అందులో 23 స్మార్ట్ కిచెన్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయన్నారు. మిగిలిన వాటిని కూడా రెండు రోజుల్లో ప్రారంభించాలన్నారు. ఇందులో స్థల కేటాయింపు, ఇసుక కంకరకు సంబంధించి సమస్యలు ఉన్నట్లయితే రెవెన్యూ అధికారులు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్మార్ట్ కిచెన్లలో ఏర్పాటు చేసే పరికరాల కోసం టెండర్, కొనుగోలు మొదలైన అంశాలపై సమీక్షించారు. స్మార్ట్ కిచెన్ల ద్వారా అందించే మధ్యాహ్న భోజనాన్ని పాఠశాలల్లో వంద శాతం మంది విద్యార్థులు తింటున్నారా.. లేదా.. అందులో నాణ్యత విషయమై తల్లిదండ్రుల నుంచి అభిప్రాయాలను కూడా సేకరించాలన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా స్మార్ట్ పార్మింగ్ ఏర్పాటుకు మండలాల్లో సదుపాయాలను సమకూర్చాలన్నారు. కూరగాయల తోటల పెంపకం, కొనుగోలు సంబంధిత అంశాలపై ఏపీ ఈఎన్ఎఫ్, డీఆర్‌డీఏ అధికారులు సమన్వయంతో ప్రణాళికలు రూపొందించాలన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు హజరత్తయ్య, ఓబులమ్మ, షంషుద్దీన్, రాజ్యలక్ష్మి, ఆదిశేషారెడ్డి, స్మార్ట్ కిచెన్ల పర్యవేక్షకులు జోయల్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ శనగలకు ఆసక్తి చూపని రైతులు

మార్కెట్ ధరకు, సబ్సిడీ ధరకు వ్యత్యాసం లేకపోవడమే...



శనగ పంట సాగు చేస్తున్న దృశ్యం



శనగ విత్తనాలు

రాజుపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రబీలో ప్రధాన పంటగా సాగు చేసే శనగ రైతులకు ప్రభుత్వం సబ్సిడీతో విత్తనాలు అందజేస్తుంది. ఈ ఏడాది సబ్సిడీ శనగలకు రైతన్నలు పెద్దగా మొగ్గు చూపడం లేదు. దీనికి బయట మార్కెట్‌లో లభించే శనగలకు, సబ్సిడీతో అందజేసే వాటి ధరకు తక్కువ వ్యత్యాసం ఉండడంతో రైతులు ఆసక్తి కనబరచడం లేదు. మండలంలో 12వేల ఎకరాల పైబడి శనగపంట సాగు చేసేందుకు రైతన్నలు పంట పొలాలను సిద్ధం చేశారు. అందుకు గాను ప్రభుత్వం 2800 క్వింటాళ్ల శనగ విత్తనాలను మండలానికి అలాట్‌మెంట్ చేసింది. అయితే రైతన్నకు సబ్సిడీ పోను క్వింటా రూ.5800 ధర నిర్ణయించారు. బయట మార్కెట్‌లో కూడా అదే రేటుకు విత్తనాలు దొరుకుతుండడంతో సబ్సిడీ శెనగలకు రైతులు పెద్దగా మొగ్గు చూపడంలేదు. 2800 క్వింటాళ్లకు గాను 600 క్వింటాళ్లకు మాత్రమే రైతులు నమోదు చేసుకున్నట్లు ఏవో శివరామక్రిష్ణారెడ్డి తెలిపారు. తెలిపారు.

ప్రారంభమైన శాఖల వారీ సమీక్ష

కడప ఎడ్యుకేషన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వైవీయూలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి శాఖల వారీగా సమీక్షలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు సైన్స్ విభాగాలపై జరిగే ఈ సమీ క్షల తొలి రోజున కెమిస్ట్రీ, ఫిజిక్స్, మ్యాథమేటిక్స్, జియాలజీ శాఖలను ఆయన పరిశీలించారు. విభాగాధిపతులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ల ద్వారా తమ శాఖలలో జరుగుతున్న పరిశోధనలు, ప్రాజెక్టులు, పేటెంట్లు, విద్యార్థుల ప్రగతి వివరించారు. శాఖల బలహీనతలు, బలాలను గుర్తించి అభివృద్ధి దిశగా ముందుకు సాగేందుకు వైస్ చాన్సలర్ సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, సైన్స్ అకాడమిక్ డీన్ ఆచార్య ఏజీ దాము, ఐక్యూ ఏసీ సంచాలకుడు డాక్టర్ సుబ్రహ్మణ్యశర్మ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

వీరబల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాయచోటి మాసాపేటలో జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ గేమ్స్‌లో పెద్దివీడు రెడ్డివారిపల్లె హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివయ్య తెలిపారు. అండర్-17 విభాగంలో వెంకట నరసింహ, రాజేశ్, అండర్-14 బేస్‌బాల్‌లో మణికంఠ ప్రతిభ చూపినట్లు తెలిపారు.

రెవెన్యూ డివిజన్ కోసం విద్యార్థుల ర్యాలీ



పీలేరు నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

పీలేరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పీలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం విద్యార్థులు భారీ ర్యాలీ చేపట్టారు. రెవెన్యూ డివిజన్ సాధన సమితి చేస్తున్న రిలే నిరాహారదీక్షలకు మద్దతుగా విద్యార్థులు స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలిలోని నిరాహారదీక్ష శిబిరం వరకు ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి పీలేరులో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటు వల్ల పీలేరులో విద్యావకాశాలు, ఉపాధి మార్గాలు మెరుగుపడతాయని వారు నినదించారు.

రిలే నిరాహార దీక్షల విరమణ

ఆరు రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న పీలేరు రెవెన్యూ డివిజన్ సాధన సమితి నాయకులు సోమవారం తమ దీక్షలను విరమించుకున్నారు. విజయవాడకు వెళ్లి మంత్రివర్గ ఉపసంఘాన్ని కలిసేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సాధన సమితి కన్వీనర్ ఎన్.సుధాకర్ బాబు తెలిపారు. రిలే దీక్షలో ఉన్న సాధన సమితి సభ్యులకు బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు చంద్రశేఖర్ రెడ్డి, పీలేరు జామియా మసీదు ముతవల్లి అల్లావుద్దీన్ నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. కార్యక్రమంలో సాధన సమితి సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, బద్దె భానుప్రకాశ్, ముల్లంగి చంద్రయ్య, నాగలేశు, తదితరులు పాల్గొన్నారు.

భూముల దారి సమస్యను పరిష్కరించాలి

వాల్మీకిపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూములకు దారి సమస్య పరిష్కరించాలని గండబోయనపల్లె దళితవాడ రైతులు డిమాండు చేశారు. ఈ మేరకు సోమవారం వారు స్థానిక తహసీల్దార్ పామిలేటికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామ సమీపంలో నాలుగు చెరువులు ఉండగా కొత్తచెరువు ప్రాంతంలో 80ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయన్నారు. ఈ భూముల వద్దకు వెళ్లాలన్నా, పంటల సాగు విషయంలో కూడా నిత్యం తిప్పలు తప్పడం లేదని వాపోయారు. చెరువు ప్రాంతంలో ఆక్రమణలు ఎక్కువై ఇబ్బందులు పడుతున్నామని విన్నవించారు. స్పందించిన తహసీల్దార్ పరిశీలించి తప్పక చర్యలు తీసుకుని రైతుల సమస్యలు పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు వెంకటరమణ, శ్రీరాములు, రమణ, ఆంజనేయులు, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సాహం ఉంటే ప్రపంచ దిగ్గజాలు తయారవుతారు



మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ విజేతగా నిలిచిన సందర్భంగా పులివెందులలో నిర్వహిస్తున్న ర్యాలీ

పులివెందుల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడల్లో తగిన ప్రోత్సాహం అందిస్తే ప్రపంచ దిగ్గజాలు తయారవుతారని పులివెందుల అర్బన్ ఎస్ఐ సుబహాన్ పేర్కొన్నారు. ప్రపంచకప్ మహిళా క్రికెట్ విజేతగా భారతదేశ జట్టు నిలిచిన సందర్భంగా పులివెందులలో ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రపంచ మహిళా జట్టు క్రికెట్ విజయం స్ఫూర్తిదాయమన్నారు. ఈ జట్టులో ఉన్న మన కడప జిల్లా ముద్దుబిడ్డ శ్రీచరణికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. శ్రీచరణిని ప్రోత్సహించిన కుటుంబ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ బాలనారాయణ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనీత, జేవీవీ జాతీయ కార్యదర్శి సనావుల్లా, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, విద్యార్థినులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో 20 మందిపై కేసు నమోదు

వేంపల్లె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం హనుమాన్‌జంక్షన్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన దాడిఘటనలో పరస్పర ఫిర్యాదుల మేరకు టీడీపీ, వైసీపీలకు చెందిన 20 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నరసిం హులు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు అలిరెడ్డిపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న వైసీపీకి చెందిన రాఘవరెడ్డి, టీడీపీకి చెందిన గోపీనాథ్‌రెడ్డిలు సోషల్‌మీడియాలో పరస్పరం రెచ్చగొట్టే వ్యాఖ్యలు పెట్టేవారు. పరస్పరం ఫోన్‌లో సవాళ్లు విసురుకున్నారు. ఈక్రమంలో హనుమాన్ జంక్ష న్ వద్ద ఉన్న రాఘవరెడ్డి వద్దకు వచ్చి గోపీ నాథ్‌రెడ్డి దాడికి దిగారు. గాయపడ్డ రాఘవరెడ్డి కడపలో చికిత్స పొందుతున్నారు. రాఘవరెడ్డి ఫిర్యాదు మేరకు గోపీనాథ్‌రెడ్డితో పాటు మరో ఐదుగురిపై, అలాగే గోపీనాథ్‌రెడ్డి ఫిర్యాదు మేర కు రాఘవరెడ్డితో పాటు 15 మందిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

తమ్ముని చంపిన అన్న అరెస్టు



మాట్లాడుతున్న సీఐ రోషన్

కమలాపురం రూరల్, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని అపాపరావుపల్లె గ్రామంలో ఆస్తి తగాదా విషయమై సొంత తమ్ముడినే హత్య చేసిన కేసులో అన్నను అరెస్టు చేసి రిమాండుకు తరలించామని సీఐ రోషన్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు తెలి పారు. అప్పారావుపల్లె గ్రామంలో అక్టోబరు 30వ తేదీ సొంత తమ్ముడైన విశ్వనాథరెడ్డితో ఆస్తి సంబంధ విషయాలపై అన్న చెన్నారెడ్డి వాగ్వా దానికి దిగాడు. ఇరువురి మధ్య మాటా మాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. దీంతో తమ్ముడు విశ్వనాథరెడ్డిపై చెన్నారెడ్డి దాడి చేయడంతో తీవ్రగాయాలై అక్కడకక్కడే కుప్ప కూలిపోయాడు. అస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. అప్పటి నుంచి పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ విద్యాసాగర్, సిబ్బందితో ప్రత్యేక టీంలుగా ఏర్పడి సోమవారం మధ్యాహ్నం చెన్నారెడ్డిని గోపులాపురం క్రాస్ రోడ్డు వద్ద అరెస్టు చేశామని సీఐ తెలిపారు. ఆస్తి సంబంధ విషయాలు, ఇతర సమస్యలను అధికారులు లేదా కోర్టులను ఆశ్రయించి పరిష్కరించుకోవాలన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థిపై దాడి

రాజంపేటటౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల పరిధిలోని అన్నమాచార్య యూనివర్శిటీలో ఇంజనీరింగ్ విద్యార్థి ఊరగాయల శాంతన్‌రెడ్డిపై కొందరు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. పోలీసుల వివరాల మేరకు.. రాయచోటి రామాపురానికి చెందిన శాంతన్‌రెడ్డి అన్నమాచార్య యూనివర్శిటీలో ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఏడాది క్రితం శాంతన్‌రెడ్డి, నితిన్ బోయనపల్లిలో ప్రైవేటుగా తీసుకొని ఉన్న సమయంలో కొందరు వ్యక్తులు నితిన్‌పై దాడి చేశారు. ఆ దాడిలో శాంతన్‌రెడ్డి పాత్ర ఉందని కక్ష్య కట్టిన కొందరు వ్యక్తులు సోమవారం తెల్లవారుజామున రూములోకి వచ్చి అతనిపై దాడి చేసి గాయపరిచారు. గాయపడిన విద్యార్థిని స్థానిక విద్యార్థులు గమనించి రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగ్గైన వైద్యం కోసం కడపకు తరలించారు. ఈ దాడిపై మన్నూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మదనపల్లె అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):రోడ్డు ప్రమాదంలో గాయపడి తిరుపతిలో చికిత్స పొందుతూ విజయకుమార్ (47) అనే వ్యక్తి సోమవారం రాత్రి మృతి చెందాడు. తాలుకా పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లె మండలం సీటీఎంకు చెందిన రమణ కుమారుడు విజయకుమార్ (47) తరిగొండలోని ఆస్పత్రిలో ఆయుష్ కాంపౌండర్‌గా పని చేస్తున్నాడు. గత నెల 25న సీటీఎం నుంచి మదనపల్లెకు బైక్‌పై వస్తూ చెట్టుకు ఢీకొని గాయపడ్డారు. అతను తిరుపతిలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఇతనికి భార్య రెడ్డెమ్మ, ఒక కుమారుడు, ఒక కుమార్తై ఉన్నారు.

విషద్రావణం తాగిన వ్యక్తి...

మదనపల్లె అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం సీటీఎం గ్రామం చిలకవారిపల్లెకు చెందిన చీనేపల్లె రమణ (55) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... రమణ గొర్రెల కాపరిగా ఉంటున్నాడు. ఇతను తాగుడుకు బానిస కావడంతో కొడుకు రెడ్డిశేఖర్ మందలించడంతో గొడవపడ్డారు. దీంతో కలత చెందిన రమణ ఈనెల 1వ తేదీ సీటీఎంకు వచ్చి మద్యంలో విషద్రావణం కలిపి తాగాడు. అతన్ని వైద్యం కోసం తిరుపతికి రూయా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. ఇతనికి భార్య కుమారుడు ఉన్నారు.

9న మదనపల్లె జిల్లా సాధన ఉద్యమ ప్రతినిధుల కలయిక

మదనపల్లె, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మంత్రివర్గ సమావేశం ఈనెల 10న జరుగనున్న నేపథ్యంలో మదనపల్లె జిల్లా ఆకాంక్షను మరోసారి ముఖ్యమంత్రికి గుర్తు చేసేందుకు 9న పెద్దమనుషుల సమావేశం పేరుతో మదనపల్లె జిల్లా సాధన ఉద్యమ ప్రతినిధుల ఆత్మీయ కలయిక నిర్వహిస్తున్నట్లు జిల్లా సాధన సమితి కన్వీనర్ పీటీయం శివప్రసాద్ తెలిపారు. ఈ సమావేశంలో మదనపల్లె జిల్లా సాధన ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరించిన పలు సంఘాల ప్రతినిధులు, రాజకీయ నాయకులు స్వచ్ఛందంగా హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మదనపల్లె జిల్లా కేంద్రంగా కొత్త జిల్లాల ఏర్పాటుకు సిఫార్సు చేసిన మంత్రివర్గ ఉపసంఘం సభ్యులకు మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాల ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. 10న జరిగే మంత్రి వర్గ సమావేశంలో మదనపల్లె జిల్లా ఏర్పాటుకు ఆమోదం తెలిపితే థాంక్యూ సీఎం పేరుతో సభ నిర్వహించి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తామని ఆయన తెలిపారు.

పిడుగుపాటు బాధిత కుటుంబానికి పరిహారం విడుదల

కలికిరి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె మండలంలో పిడుగుపాటు బాధిత కుటుంబానికి పరిహారం విడుదల చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మండలంలోని చౌటపల్లె గ్రామానికి చెందిన జి.నారాయణ 2023 మే నెల 11వ తేదీన పిడుగుపాటుకు గురై మరణించాడు. బాధిత కుటుంబానికి విపత్తు నిధుల కింద పరిహారం అందజేయాలని కోరతూ కలెక్టరు అక్టోబరు 21 ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు రూ.4లక్షలు ప్రభుత్వం విడుదల చేసింది. బాధిత కుటుంబం బ్యాంకు ఖాతాలో ఈ నిధులు వెంటనే జమ చేయాల్సిందిగా ఆదేశిస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

43 ఏళ్ల కల సాకారం చేశారు

మదనపల్లె టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): 43ఏళ్ల నుంచి భారత్ మహిళా క్రికెట్ టీమ్‌కు అందని కలగా మిగిలిపోయిన వరల్డ్ కప్‌ను దక్కించుకుని 125 కోట్ల మంది భారతీయుల కల సాకారం చేశారని పోర్డు సంస్థ ప్రతినిధి లలితమ్మ అన్నారు. సోమవారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో పోర్డు సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థినులు మహిళా క్రికెట్ వరల్డ్ కప్ విజయం పట్ల సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా లలితమ్మ మాట్లాడుతూ బాలికలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా ప్రోత్సహిస్తే మట్టిలో మాణిక్యాలను వెలికి తీయొచ్చన్నారు. అనంతరం కేక్ కట్ చేసి విద్యార్థినులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ రామ్మూర్తి, ఇన్‌చార్జి హెచ్ఎం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా : నలుగురికి గాయాలు

మదనపల్లె అర్బన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తాపడి నలుగురు వ్యక్తులు గాయపడిన సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గుర్రంకొండ మండలం టి.రాచపల్లెకు చెందిన సిద్దారెడ్డి (92) అనారోగ్యంతో ఉండడంతో మదనపల్లె ఆస్పత్రికి తరలించడానికి ఆటోలో బయలుదేరారు. ఆరోగ్యవరం వద్దకు చేరకుకోగానే కుక్కలు ఆటోకు అడ్డురావడంతో వాటిని ఢీ కొట్టి ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న సిద్దారెడ్డి కుమార్తై అనుసూయమ్మ, మనుమరాలు సాయివాణి ఆటో డ్రైవర్ రెడ్డెప్పరెడ్డి గాయపడ్డారు. వారిని జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పీలేరులో కొవ్వొత్తుల ర్యాలీ

పీలేరు రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట మృతులకు సంతాపంగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లిన భక్తులు తొక్కిసలాటలో 9 మంది మృతి చెందడంతో పాటు పలువురు తీవ్రంగా గాయపడడం దురదృష్టకరమని, భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరుగకుండా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.25లక్షల ఎక్స్‌గ్రేసియా, క్షతగాత్రులకు మెరుగ్గైన వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో సుంకర చక్రధర్, ద్వారకనాథరెడ్డి, లోకనాథరెడ్డి, మూరే భువనేశ్వరర్ రెడ్డి, నరేష్, ఇమ్రాన్, కాలనీ చిన్న, లోకనాథం, జాకీర్, ఆదినారాయణ రాజు, అశోక్, వికాస్, మస్తాన్, సాంబశివరెడ్డి, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాలు

నేలమల్లేశ్వర స్వామి ఆలయంలో పౌర్ణమి పూజలు



నిమ్మనపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని తవళం అటవీ ప్రాంతంలో వెలసిన నేలమల్లేశ్వస్వామి ఆలయంలో పౌర్ణమి పూజలతో పాటు లక్షదీపారాధన నిర్వహించనున్నట్లు ఈవో మంజుల తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా ఆలయానికి అధిక సంఖ్యంలో భక్తులు వస్తున్నారని, ఇందులో భాగంగా ఈనెల 5న నేలమల్లేశ్వ స్వామి కల్యాణోత్సవం, లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం నూతన రథంలో స్వామివారి ఊరేగింపు కార్యక్రమం వుంటుందని తెలిపారు.

వైభవంగా ఉరుసు

రామసముద్రం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రాగిమాకులపల్లె క్రాస్ సమీపంలో ఉన్న హజ్రత్ పీర్ మహ్మద్ మున్వర్ అలీషా ఖాదరి ఉరుసు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో కులమతాలకు అతీతంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్గాలో చక్కెర చదివింపులు చేశారు. ఈ సందర్భంగా దర్గాను పలు రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. హైదరాబాద్ బృందం నిర్వహించిన ఖవ్వాలి భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు హజ్రత్ పీర్ (ఆర్‌పి) అలీ షా హజ్రత్, సయ్యద్ రెహమాన్ షా ఖాదరి, పీర్ సయ్యద్ ఖాదరి అలీషా సాహెబ్, ఖాదరి చమన్ పాల్గొన్నారు.

కార్తీక మాసం.. శివదేవుని సన్నిధిలో..



కేదారేశ్వర గౌరీ వ్రతానికి పీలేరు శివాలయంలో పోటెత్తిన భక్తులు



వాల్మీకిపురంలో పూజలందుకుంటున్న గౌరీ కేదారేశ్వర దేవతామూర్తులు

పీలేరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): "కార్తీక మాసములో.. శివదేవుని సన్నిధిలో.. నిను కొలిచెదము.. నిను తలచెదము.. మము చల్లగ చూడవ శంకరా.." అంటూ భక్తులు పరవశించిపోయారు. మహాదేవుడికి ఇష్టమైన కార్తీక మాసంలో స్వామివారిని దర్శించేందుకు భక్తులు తరలివచ్చారు. సోమవారం సందర్భంగా పీలేరులోని కాశీవిశ్వేశ్వరస్వామి, శివరామపురంలోని భ్రమరాంబికాదేవి మల్లిఖార్జునస్వామి, అడవిపల్లెలోని మద్దుండాల మల్లేశ్వరస్వామి, జంగంపల్లెలోని వీరభద్రస్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆయా ఆలయాల్లో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో కేదారగౌరీ వ్రతం నిర్వహించారు. ప్రత్యేక దీపారాధనతో సాయంత్రం ఆలయాలు దేదీప్యమానంగా వెలిగిపోయాయి. ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పోటెత్తిన భక్తులు

కలకడ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సత్యవతి నది ఒడ్డున కొలువైన కామాక్షి సమేత సిద్ధేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. రెండవ కార్తీక సోమవారం కావడంతో కేధారేశ్వర నోముల వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించి గౌరమ్మకు పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

గుర్రంకొండలో..

గుర్రంకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కేదారేశ్వర నోముల వ్రతాన్ని మహిళలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా మంజునాథస్వామి ఆలయం, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, ఉమామహేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో అర్చకులు వ్రత విశిష్టతను భక్తులకు వివరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

వాల్మీకిపురంలో..

వాల్మీకిపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం వాల్మీకిపురంలో గౌరీ కేదారేశ్వర వ్రత వేడుకలు ఎంతో వైభవంగా నిర్వహించారు. స్థానిక కోనేటివీధిలోని లక్ష్మీకామేశ్వరస్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం, అర్చన, అర్ధనారీశ్వర అలంకరణలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గౌరీ వ్రతం నిర్వహించి, భక్తులకు వ్రత విశిష్టతను వివరించారు. అలాగే పట్టణ పడమర పొలిమేరలోని ధర్మపథం సమూహాలయంలో కూడా వ్రత వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయాల వద్ద భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాలలో సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, గోనవరపు శీనాస్వామి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రెండో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని మండలంలోని అన్ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు వెళ్లి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. మండల కేంద్రంలోని శివాలయంలో మహిళలు భక్తిశ్రద్ధలతో కేదారేశ్వర గౌరీ వ్రతాన్ని ఆచరించి నోములు నోచుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు వ్రత మహత్యాన్ని భక్తులకు వివరించారు. అనంతరం అర్చనలు అభిషేకాలు చేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



గుర్రంకొండ మంజునాథాలయంలో నోముల వ్రతం

వాల్మీకిపురంలో నిన్నటి పాలకేంద్రం



పాల కేంద్రం పరిసరాలు శుభ్రం

ఆంధ్రజ్యోతి స్పందన

వాల్మీకిపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాలశీతలీకరణ కేంద్రం దుస్థితిపై రెండు రోజుల క్రితం ఆంధ్రజ్యోతి దినపత్రికలో నిర్లక్ష్యపు నీడలో పాలకేంద్రం అన్న కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన మహిళా సమాఖ్య అధికారులు పరిష్కార చర్యలు చేపట్టారు. పాల కేంద్రం పరిసరాలను ఎక్సకవేటర్ తో శుభ్రం చేయించారు. అలాగే సమీపంలో ఉన్న మహిళా సమాఖ్య కార్యాలయం ముందు భాగంలో కూడా బురద గుంటను తొలగించి శుభ్రం చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈసందర్భంగా ఏపీఎం నరోత్తమరెడ్డి మాట్లాడుతూ ఇకపై ఎప్పటికప్పుడు పాలకేంద్రాన్ని పర్యవేక్షించడం జరుగుతుందన్నారు.



శుభ్రం చేసిన తరువాత పాలకేంద్రం పరిసరాలు

మల్లయ్యకొండపై రూ.6లక్షలతో షెడ్డు నిర్మాణం



మల్లయ్యకొండ పైన నిర్మించిన రేకుల షెడ్డు వద్ద దాతలు

తంబళ్లపల్లె, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండ పైన భక్తుల సౌకర్యార్థం ఓ దాత రూ.6లక్షలతో షెడ్డు నిర్మించారు. అన్నమయ్య జిల్లా గాలివీడు పప్పిరెడ్డిగారిపల్లెకు చెందిన ఎస్‌ఆర్‌ఐ హరిప్రసాదరెడ్డి, లక్ష్మీప్రసన్న దంపతులు వారి తండ్రి పిప్పిరెడ్డిగారి గంగిరెడ్డి జ్ఞాపకార్థం ఈ రేకుల షెడ్డును నిర్మించారు. సోమవారం దాతలు కుటుంబసభ్యులతో కలసి భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకుని పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం దేవదాయశాఖ అధికారులతో కలసి రేకుల షెడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ అధికారులు, భక్తులు అభినందించారు.

పాఠశాలలకు ప్రత్యేక అధికారుల నియామకం

నిమ్మనపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని మండలాలకు హై స్కూల్.. హై ఫ్రెండ్ కింద ప్రత్యేక అధికారులను కలెక్టర్ నియమించినట్లు ఎంఈవో-2 నారాయణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో వున్న ఐదు జడ్పీహైస్కూళ్లలో చదువుతున్న 9, 10వ తరగతి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించి పదవ తరగతిలో మెరుగైన ఫలితాలును తీసుకువచ్చేందుకు ప్రత్యేక అధికారులు కృషి చేయనున్నట్లు తెలిపారు. అలాగే వారానికి రెండుసార్లు పాఠశాలలను సందర్శించి నివేదికలు తయారు చేసి కలెక్టర్‌కు అందజేయాలని తెలిపారు. ప్రత్యేక అధికారులుగా పశువైద్యాధికారులు సురేశ్, చంద్రలేఖ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మిధున్ చక్రవర్తి, వ్యవసాయ అధికారి మంజుల, సోషియల్ వెల్ఫేర్ అధికారి గంగిరెడ్డి నియమించబడ్డారు. కాగా సోమవారం ప్రత్యేక అధికారి మిధున్ చక్రవర్తి నిమ్మనపల్లి జడ్పీహైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థులతో ముఖాముఖి అయ్యారు. కార్యక్రమంలో ఎంసీవో గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

ఒకటి, రెండు పనులైనా పూర్తి చేద్దాం

● కౌన్సిల్ సమావేశంలో సభ్యుల తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజ, కమిషనర్ కె.ప్రమీల

మదనపల్లె, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పాలకవర్గానికి ఉన్న రెండు నెలల్లో కనీసం ఒకటి, రెండు పనులైనా పూర్తి చేయాలని కౌన్సిలర్లు నిర్ణయించారు. నాలుగున్నరేళ్లలో పూర్తిస్థాయిలో పనులు చేయలేకపోయినా, ఉన్న తక్కువ గడువులోనైనా గుర్తింపు కోసం రోడ్లు, కాలువలు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం చైర్‌పర్సన్ వి.మనూజ అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. అక్టోబరు నెలకు సంబంధించిన సమావేశం నెలాఖరులో జరగాల్సివుండగా వివిధ కారణాలతో వాయిదా పడింది. ఆ సమావేశంలో చర్చించాల్సిన, చేపట్టాల్సిన అంశాలను అత్యవసర సమావేశంలోకి తెచ్చి నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యంగా మున్సిపాలిటీలో దినసరి, వారపుసంత మార్కెట్‌తో పాటు మున్సిపల్ అద్దె రూముల కేటాయింపు, తదితర అజెండాలోని ఆరు అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్‌చైర్మన్ నూర్‌ఆజాం మాట్లాడుతూ తన వార్డులోని సైదాపేటలో మూడునెలలుగా తాగునీటి సమస్య అధికంగా ఉందని, వారానికోసారి మాత్రమే నీటి సరఫరా జరుగుతోందని, సమస్యపై ఇంజనీరింగ్ అధికారులను అడిగితే వివిధ కారణాలతో కాలం గడుపుతున్నట్లు సమావేశం దృష్టికి తెచ్చారు. అలాగే శానిటేషన్ కూడా దారుణంగా ఉందని, దీన్ని మెరుగు పరచకుంటే ప్రజలు ఆరోగ్యసమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కౌన్సిలర్ ఖాజాహుస్సేన్ మాట్లాడుతూ వర్షం వస్తే ఎన్నడూ లేని విధంగా రోడ్లు జలమయం అవుతున్నట్లు చెప్పారు. అలాగే ట్రాఫిక్ సమస్య, గుంతలమయం అయిన రోడ్లతో ప్రజలు తీవ్రఅవస్థలు పడుతున్నారన్నారు. ఆరోవార్డు కౌన్సిలర్ కె.ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ప్రజల ఇబ్బందులు, అవసరాలను దృష్టిలో పెట్టుకుని, కౌన్సిల్ ఇదివరకే వాయిదా వేసిన, రద్దు చేసిన అంశాలను ప్రాధాన్యత ప్రకారం వచ్చే సమావేశం అజెండాలోకి తెచ్చి పరిష్కరించాలని సూచించారు. తమవార్డులో మంజూరైన వాటర్‌ప్లాంటును సకాలంలో పూర్తి చేయాలని ప్రసాద్‌బాబు కోరారు. మరోకౌన్సిలర్ షేక్ కరీముల్లా మాట్లాడుతూ మనం ఇంత కాలం కౌన్సిల్‌లో క్షేత్రస్థాయిలో చేసిన పనుల కంటే అప్రూవల్ చేసిన పనులే ఎక్కువగా ఉన్నాయని, పదవీకాలం ముగిసేలోపు వార్డులో కనీసం ఒకటి రెండు పనులు చేస్తే మర్యాద అయినా మిగులుతుందని సూచించారు.

సరళమైన పద్ధతిలో విద్యాబోధన చేయండి



తాటిమాకులపల్లి పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో మనోహర్

పెద్దమండ్యం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సరళమైన పద్ధతిలో విద్యాబోధన చేయాలని ఎంఈవో మనోహర్ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండలంలోని కలిచెర్ల, తాటిమాకులపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మోనూ ప్రకారం అందించాలని, పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యతో పాటు ఆరోగ్యం, క్రీడలపై కూడ అవగాహన కల్పించాలని తెలిపారు. విద్యలో వెనకబడిన వారికి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. పాఠశాల కమిటీలు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధిపై చర్చించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక ఉల్లాసం

పెద్దమండ్యం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) క్రీడలతో శారీరకంగా ఉల్లాసంగా ఉంటామని ఎంఈవోలు మనోహర్, రామకృష్ణ తెలిపారు. పెద్దమండ్యంలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎంఈవోలు, ఉపాధ్యాయులు క్రికెట్ ప్రాక్టీస్ చేశారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16వ తేదీల్లో జరుగునున్న మండల స్థాయి ఆటల పోటీలకు ముందస్తుగా క్రీడల ప్రాక్టీస్ చేశారు. ప్రతి ఒక్కరు క్రీడలపై ఆసక్తి కలిగిఉండాలన్నారు. పోటీల్లో మెరుగైన ఆటను ప్రదర్శిస్తామని ఎంఈవోలు, ఉపాధ్యాయులు ధీమా వ్యక్తం చేశారు.

పేదలకు వైద్య విద్యను దూరం చేయడం దుర్మార్గం

● మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పీపీపీ విధానం ద్వారా పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడం దుర్మార్గమని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ముడుపులవేముల, బోడుమల్లువారిపల్లె, కావలిపల్లెలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల పాలిట శాపంగా మారిన పీపీపీ విధానాన్ని సత్వరం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో డబ్బున్న పెద్దపెద్ద నాయకులకు మెడికల్ కళాశాలలు అప్పగించడం వల్ల పేదలకు ఎటువంటి ప్రయోజనం ఉండదని తెలిపారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను మూడు పోలీస్ స్టేషన్లు, ఆరు కేసుల చందంగా మార్చేసిందని విమర్శించారు. వాస్తవ పరిస్థితులను గుర్తించి ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఏటీ రత్నశేఖర్ రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, ముడుపులవేముల మధుసూదన్ రెడ్డి, సుంకర చక్రధర్, లోకనాధరెడ్డి, జ్ఞానశేఖర్‌రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాధరెడ్డి, భువనేశ్వర్ రెడ్డి, రాజేష్, హరి, అశోక్, వెంకటప్ప, అమనాద్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వైభవంగా నోముల వ్రతం



మంజునాధస్వామి ఆలయంలో కేదారేశ్వర నోముల వ్రతంలో పాల్గొన్న మహిళలు

మదనపల్లె అర్బన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలో కేదారేశ్వర నోముల వ్రతం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా చిప్పిలి గ్రామంలో మడికయ్యల శివాలయంలోని యోగభోగేశ్వర స్వామి ఆలయం, సీటీఎం రోడ్డులోని మంజునాథస్వామి ఆలయం, దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయం, నీరుగట్టువారిపల్లె నీలకంఠేశ్వరస్వామి ఆలయం, సీటీఎంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కేదారేశ్వరస్వామి వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు నోముల వ్రతం కథను భక్తులకు వినిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మద్యం విక్రేతలపై కేసు నమోదు

● 49 బాటిళ్లు స్వాధీనం

గుర్రంకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): బెల్టు దుకాణాలపై పోలీసులు దాడులు నిర్వహించి సోమవారం ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ గజేంద్ర తెలిపారు. మండలంలోని నడిమిఖండ్రిగలో బెల్టు దుకాణం నిర్వహిస్తున్న ఓ వ్యక్తి నుంచి 25 మద్యం బాటిళ్లను, అలాగే గుర్రంకొండ పట్టణంలోని బస్టాండు వద్ద బెల్టుషాపు నిర్వహిస్తున్న మరోవ్యక్తి నుంచి 24 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ స్టాల్‌ను సద్వినియోగం చేసుకోండి

వాల్మీకిపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయం ఆవరణలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రకృతి వ్యవసాయ స్టాల్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి మురళీమోహన్ తెలిపారు. ప్రకృతి వ్యవసాయం రైతులకు ఎంతో లాభదాయకమన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కరువు మండలాలుగా ప్రకటించాలి

ములకలచెరువు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గంలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప మాట్లాడుతూ నియోజకవర్గంలో కురబలకోటను తప్ప మిగతా మండలాలను కరువు మండలాలుగా ప్రకటించక పోవడం బాధాకరమన్నారు. రైతులు పంటలు పండించి గిట్టుబాటు ధరలు లేక తీవ్రంగా నష్టపోయారన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు మంచాల హరికుమార్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి నిజాముద్దీన్, శంకరప్ప, చంద్ర, శంకరమ్మ, రమణమ్మ, అంజనమ్మ పాల్గొన్నారు.

సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

పీలేరు రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీడీవో శివశంకర్ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వచ్చిన సమస్యలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఇందులో ఎటువంటి కాలయాపన ఉండరాదని హెచ్చరించారు. అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో లోకేశ్వర్ రెడ్డి, పీలేరు ఈవో బ్రహ్మానందరెడ్డి, పీఆర్ ఏఈ రామక్రిష్ణ నాయక్, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలి

నిమ్మనపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు సమన్వయంతో పని చేయాలని ఎంపీడీవో రమేశ్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల్లో ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేయాలన్నారు. అలాగే పెన్షన్ పంపిణీలో అలసత్యం వహించరాదని తెలిపారు. ప్రతి పనిని సమన్వయంతో చేస్తూ పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం మురళి, ఏపీవో రమేశ్, ఇరిగేషన్ ఏఈ శ్రీహరిరెడ్డి, కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు

కురబలకోట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు ఎంపీడీవో గంగయ్య తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ధాత్రి ఆబా ఆది కర్మయోగి కార్యక్రమంలో భాగంగా మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులను అన్నివిధాలా అభివృద్ధి చేయడానికి పలు అంశాలను పరిగణనలోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. దీంతో ఆ గ్రామాలలో మౌలిక వసతులతో పాటు కుటుంబాల అభివృద్ధికి చేయూతనందిస్తుందన్నారు. దీనికి సంబంధించిన నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు తెలిపారు.

అయ్యప్పస్వాములకు భిక్ష

కలికిరి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మాల ధరించిన స్వాములకు ముస్లింలు సోమవారం భిక్ష ఏర్పాటు చేశారు. స్థానిక మదనపల్లె రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయంలో అయ్యప్ప స్వాములకు వివిధ రకాల ఆహార పదార్థాలతో ట్రాక్టర్ మెకానిక్ ఖాదర్‌వల్లీ ఈ భిక్షను ఏర్పాటు చేశారు. స్వాముల దీక్షలు విజయవంతం కావాలని ముస్లింలు కోరారు. కార్యక్రమంలో రెడ్డిబాషా, దస్తగిరి, అలీ, ముక్తదా, ఫైజన్, మణి, ద్వారకనాథ రెడ్డి, శ్రీరాములు, ప్రభాకర్ రెడ్డి, దేవేంద్ర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.